# వన్ హెల్త్ మిషన్‌తో సమగ్ర ఆరోగ్య రక్షణ



వన్‌హెల్త్‌ను ఆవిష్కరించిన తిరుమల్ ఆరోహి, డా.విశాల్‌రావ్, కిరణ్ రుద్రప్ప తదితరులు

**ఈనాడు, బెంగళూరు:** ఆరోగ్య చికిత్సల్లో ఆధునిక సాంకేతికతను సమగ్రంగా వినియోగించుకునే దిశగా 'వన్ హెల్త్' మిషన్‌ను ఆవిష్కరించారు. నగరానికి చెందిన సంస్థల నేతృత్వంలో ఈ మిషన్ ఆవిష్కృతమైంది. ఇన్ఫోసిస్, భారతీయ విజ్ఞాన సంస్థ(ఐఐఎస్సీ), హెచ్‌ఏఎల్ వంటి సంస్థల సమన్వయంతో ఈ సమగ్ర ఆరోగ్య మిషన్‌ను రూపొందించారు. మారుతున్న ఆధునిక సాంకేతికతలను సమర్థవంతంగా వినియోగించుకుంటూ సంప్రదాయ చికిత్స విధానాల పరిమితులను చెరిపి వేసే ఈ మిషన్ కృత్రిమ మేధతో తయారైన దూరదృష్టం, వైద్య పరికరాలు, కొత్త తరం ఆవిష్కారాలతో ఆరోగ్య వ్యవస్థను సిద్ధం చేయనుంది. ఆధునిక సాంకేతిక వ్యవస్థల సాయంతో పరిరక్షించాలి. ఈ క్రమంలో వన్‌హెల్త్ మిషన్ డిజిటల్ ఏఐ, కొత్తతరం ఔషధాలు, వైద్య విధానాలు, ఆరోగ్య వ్యవస్థలను రూపొందించనున్నారు. సమగ్ర ఆరోగ్యం, విజ్ఞానం, సాంకేతికతలతో ప్రజారోగ్య సవాళ్లను ఎదుర్కోవాలని హెల్త్ అధ్యక్షులు డా.విశాల్ రావ్ తెలిపారు. గ్లోబల్ టెక్ ట్రాన్స్‌ఫర్, లాంగ్విటీ ఎక్స్‌పీరియెన్స్ ప్లాట్‌ఫామ్ ప్రెసిడెంట్ సెంటర్ సమన్వయంతో వన్‌హెల్త్ మిషన్ రూపొందించామని ఇన్ఫోసిస్ ఎగ్జిక్యూటివ్ ఉపాధ్యక్షుడు తిరుమల్ ఆరోహి, ఐఐఎస్సీ లాంగ్విటీ ఇండియా కన్వీనర్ డా.దీపక్ సైని అభిప్రాయపడ్డారు.

## కుమారస్వామిపై ఫిర్యాదు

**బెంగళూరు (శివాజీనగర), న్యూస్‌టుడే:** తనపై తప్పుడు ఆరోపణలు చేసి, దూషణలకు పాల్పడిన కేంద్ర మంత్రి హెచ్‌డీ కుమారస్వామి, ఆయన కుమారుడు నిఖిల్ కుమారస్వామి, దళ్ నాయకుడు సురేశ్ బాబులపై ఐపీఎస్ అధికారి చంద్రశేఖర్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఏడీజీపీ ఫిర్యాదు ఆధారంగా సంజయనగర ఠాణా పోలీసులు ఎన్‌సీఆర్ (తీవ్ర స్వరూపం కాని కేసు)ను నమోదు చేశారు. తనపై లోకాయుక్తలో ఉన్న కేసుల విచారణకు హాజరైన అనంతరం కొద్ది రోజులకే కుమారస్వామి తనను దూషిస్తూ, తప్పుడు ఆరోపణలు చేశారని పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో ఆయన పేర్కొన్నారు.


ఈనాడు కర్ణాటక






గహ్లోత్ మాటలు ఆలకిస్తున్న సిద్ధరామయ్య

# ఔను వాళ్లిద్దరూ తారసపడ్డారు



గవర్నర్‌జీ ఆసీనులు కండి అంటున్న సిద్ధరామయ్య

**మైసూరు, న్యూస్‌టుడే:** మాజీ రాష్ట్రపతి రాక సందర్భంలో రాజభవన్‌లో గవర్నర్ థావర్‌చంద్ గహ్లోత్‌కు సిద్ధరామయ్య ఎదురుపడ్డారు. ముడా అక్రమాలకు సంబంధించి సిద్ధరామయ్యను విచారణ చేసేందుకు అనుమతి ఇచ్చిన నెల అనంతరం వారిద్దరూ అప్పుడు ఒకరికొకరు తారసపడ్డారు. మైసూరు బన్ని మండపం వద్ద శనివారం రాత్రి నిర్వహించిన కాగడాల ప్రదర్శన వేదికపై వీరిద్దరూ మళ్లీ ఎదురు పడ్డారు. ఒకరి చేతులు, మరొకరు పట్టుకుని కొంత సమయం మాట్లాడుకున్నారు. పక్కపక్కనే కూర్చున్న వారిద్దరూ కొంత సేపు మాట్లాడుకున్నారు. వివిధ దళాల నుంచి గౌరవ వందనాన్ని స్వీకరించేందుకు గవర్నర్ వెళ్లిన అనంతరం ఉప ముఖ్యమంత్రి, ముఖ్యమంత్రి ఇద్దరూ సుదీర్ఘంగా మాట్లాడుకుంటూ కనిపించారు.

# హస్తినపై సమర భేరి!

**• పన్నుల వాటా కోసం మళ్లీ పట్టు • దశలవారీగా పోరుకు సర్కారు కసరత్తు**



గత ఫిబ్రవరిలో దిల్లీలో ఆందోళన చేపడుతున్న రాష్ట్ర మంత్రులు, కాంగ్రెస్ నేతల బృందం

**ఈనాడు, బెంగళూరు:** కేంద్ర ప్రభుత్వంపై రాష్ట్ర సర్కారు మరోసారి పోరుకు సిద్ధమైంది. రాకపోతే ఈసారి రాజకీయపరమైన అంశాలతో కాదు. సమాఖ్య ప్రజాస్వామ్యంలో రాష్ట్రానికి దక్కాల్సిన వాటాపై భాజపాయేతర ప్రభుత్వాలున్న రాష్ట్రాలపై కేంద్రం సవతితల్లి ప్రేమ చూపుతోందని ఆరోపిస్తున్న కాంగ్రెస్ సర్కారు ప్రతి త్రైమాసికంలో రాష్ట్రానికి జరిగే అన్యాయాన్ని బహిరంగంగా ప్రశ్నించనుంది. ఆర్థిక సంఘం సిఫార్సులను కేంద్రం ఉద్దేశపూర్వకంగా తోసిపుచ్చుతోందంటూ సర్కారు శాసనసభ సమావేశాల్లోనూ గట్టిగానే ప్రశ్నించింది. గత ఫిబ్రవరిలో దిల్లీలోని జంతర్‌మంతర్‌లో రాష్ట్ర ప్రభుత్వమంతా సమావేశమై కేంద్ర సర్కారు నిర్లక్ష్యాన్ని నిలదీసింది. ఇన్ని రోజుల తర్వాత మళ్లీ అదే అంశంతో దశలవారీగా కేంద్రంపై నిరసన వ్యక్తం చేసేందుకు సిద్ధమైంది.

### తాజా వాటాపై అసమ్మతి జ్వాల

కేంద్ర ప్రభుత్వం ఇటీవల రాష్ట్ర ప్రభుత్వాలకు రూ.1.78 లక్షల కోట్ల పన్నుల వాటాను ప్రకటించింది. ఈ వాటాలో రాష్ట్రానికి దక్కిన సొమ్ముపై ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రులు భగ్గుమన్నారు. ఏ రాష్ట్రంతో పోల్చినా అతి తక్కువ వాటా పొందిన రాష్ట్రాల్లో కర్ణాటక ఒకటి. కేంద్రం వసూలు చేసే పన్నుల నుంచి రూ.6,498 కోట్లు మాత్రమే కర్ణాటకకు విడుదల చేసినట్లు ముఖ్యమంత్రి ధ్వజమెత్తారు. గత త్రైమాసికంతో పోలిస్తే రూ.2వేల కోట్లు తక్కువ వాటా దక్కటంతో సర్కారు తీవ్ర అసంతృప్తికి గురైంది. కేంద్రం నుంచి పదేపదే జరుగుతున్న అన్యాయాన్ని రాజకీయాలకు అతీతంగా ప్రశ్నించాలని ఆయన పిలుపునిచ్చారు. రాష్ట్రం నుంచి అత్యధిక సంఖ్యలో ఎంపీలు గెలిచినా ఎవరూ రాష్ట్రానికి జరుగుతున్న అన్యాయం గురించి నోరు మెదపటం లేదని ఆరోపించారు. ప్రధాని ముందు సగర్వంగా నిలబడే ధైర్యం లేని భాజపా ఎంపీలు ఇక్కడి సర్కారును నిత్యం ఆరోపిస్తుంటారన్నారు. ఎంపీలతో పాటు కేంద్ర మంత్రులుగా ఉన్న ప్రహ్లాద్ జోషి, కుమారస్వామి సీనియర్లు. వారికీ రాష్ట్రం కోసం సభలో ప్రశ్నించే సత్తా లేదన్నారు.

**పోరు బాట:** ఏటేటా కేంద్ర బడ్జెట్‌లోనూ అంతగా దక్కని నిధులు, ఆర్థిక సంఘం సిఫార్సులను లక్ష్యపెట్టని తీరు, ప్రతి త్రైమాసికంలో నిబంధనలకు విరుద్ధంగా రాష్ట్రానికి దక్కుతున్న వాటా.. ఇలాంటి అంశాలపై కేంద్రంపై దశలవారీగా నిలదీసే కార్యక్రమాలు చేపట్టాలని సర్కారు నిర్ణయించింది. ఇందు కోసం రానున్న శీతాకాల సమావేశాల్లో సభలో చర్చలు, అఖిలపక్ష సమావేశం, మంత్రివర్గ సమావేశాల్లో సభలో చర్చలు, అఖిలపక్ష సమావేశం, మంత్రివర్గ సమావేశాల్లో కేంద్రం తీరుపై తీర్మానాలు, రాష్ట్ర, దేశ రాజధానుల్లో ఆందోళన చేపట్టాలని నిర్ణయించారు. మంత్రుల బృందాలు వేర్వేరుగా కేంద్ర మంత్రులతో భేటీలు, మనవి పత్రాలతో కేంద్రంపై ఒత్తిడి, దక్షిణ భారత రాష్ట్రాల ఆర్థిక మంత్రులతో ప్రత్యేక సమావేశాలను నిర్వహించాలని సర్కారు తీర్మానించింది.

### దుష్పరిపాలనకు మా సహకారమా?

కేంద్రం ప్రకటించిన పన్నుల వాటాలో కర్ణాటకకు దక్కింది రూ.6,498 కోట్లు. చెత్త పరిపాలనతో పేరు పొందిన ఉత్తరప్రదేశ్‌కు ఈసారి రూ.31,962 కోట్లు దక్కినట్లు ముఖ్యమంత్రి సిద్ధరామయ్య మండిపడ్డారు. బిహార్‌కు రూ.17,921 కోట్లు, మధ్యప్రదేశ్‌కు రూ.13,987 కోట్లు, రాజస్థాన్‌కు రూ.10,737 కోట్లు కేటాయించారు. పదేపదే కోట్లకు పైగా వాటా పొందిన రాష్ట్రాల్లో ఎక్కువ శాతం పాలనతో వైఫల్యం చెందిన ప్రభుత్వాలున్నాయి. మాలాంటి రాష్ట్రాల నుంచి సేకరించిన పన్నులను ఇతర రాష్ట్రాలకు మళ్లిస్తున్నారు. అంటే దుష్పరిపాలన అందిస్తున్న రాష్ట్రాలకు మేము సహకరిస్తున్నట్లుగా ఉందని సిద్ధరామయ్య అభిప్రాయపడ్డారు. పన్నుల వాటాల్లో హేతుబద్ధత ను పాటించాలన్న కనీస నిబంధనను కేంద్రం విస్మరిస్తోంది. మేము ప్రశ్నించిన ప్రతిసారీ అభివృద్ధి చెందిన రాష్ట్రాలకు కేంద్ర పన్నుల వాటా తక్కువగానే వస్తోందని బదులిస్తున్నారు. పైగా జనసంఖ్య ఆధారంగా నిధులు కేటాయించాలన్న నిబంధనను కూడా కేంద్రం గుర్తు చేస్తోంది. కేంద్రమే ఇచ్చిన జనాభా నియంత్రణ పిలుపును అందిపుచ్చుకోవటమే మేము చేసిన నేరమా? అని ముఖ్యమంత్రి ప్రశ్నించారు. ఉప ముఖ్యమంత్రి డీకే శివకుమార్ కేంద్ర ప్రకటించిన వాటాపై స్పందించారు. రాష్ట్రం నుంచి రెండు సార్లు రాజ్యసభకు నియమితులైన నిర్మలా సీతారామన్‌తో పాటు నలుగురు కేంద్ర మంత్రివర్గంలో ఉన్నా వారంతా రాష్ట్ర హక్కుల గురించి ప్రశ్నించటం లేదని ఆరోపించారు. మాజీ ఎంపీ డీకే సురేశ్ గతంలో కేంద్రంపై ఇదే అంశంపై ఆరోపించారు. దక్షిణ భారత రాష్ట్రాలపై కేంద్రం ఇదే నిర్లక్ష్యాన్ని కొనసాగిస్తే ప్రత్యేక దేశం కోసం పోరు తప్పదని గతంలో పార్లమెంట్ భవనం వద్ద ఆరోపించిన డీకే సురేశ్ ఈసారి అన్ని రాష్ట్రాలు తరలి రావాలని పిలుపునిచ్చారు.

## చెన్నపట్టణ అభ్యర్థి నేనే

**మైసూరు, న్యూస్‌టుడే:** చెన్నపట్టణ ఉప ఎన్నికల్లో అభ్యర్థిని నేనే అని ఉప ముఖ్యమంత్రి డీకే శివకుమార్ పేర్కొన్నారు. నా కుటుంబం నుంచి చెన్నపట్టణలో ఎవరూ పోటీ చేయరని, తానే అభ్యర్థిని అని మైసూరులో విలేకరులకు తెలిపారు. గత లోక్‌సభ ఎన్నికల్లో బెంగళూరు గ్రామీణ లోక్‌సభ నియోజకవర్గం నుంచి తన సోదరుడు ఓటమి పాలయ్యారని, ఇప్పుడు చెన్నపట్టణ నుంచి డీకే సురేశ్ పోటీ చేయడం లేదని స్పష్టం చేశారు.

## నేనూ పోటీ చేస్తా

**దావణగెరె, న్యూస్‌టుడే:** చెన్నపట్టణ ఉప ఎన్నికల్లో ఎన్‌డీఏ అభ్యర్థిగా తానే పోటీలో ఉంటానని కేంద్ర మంత్రి హెచ్‌డీ కుమారస్వామి పేర్కొన్నారు. దావణగెరెలో విలేకరులతో ఆదివారం మాట్లాడుతూ, కాంగ్రెస్ పార్టీ ప్రజలను దారి తప్పించేందుకు పోటీలో ఎవరు ఉంటారనే అంశంలో గోప్యత పాటిస్తున్నట్లే తామూ వ్యవహరిస్తున్నామని చెప్పారు. నిఖిల్ పోటీ చేస్తాడా, తాను పోటీ చేస్తానా అనే విషయాన్ని ఇప్పుడే చెప్పడం సాధ్యం కాదన్నారు. అవసరమైతే తానే పోటీలో ఉంటానని పేర్కొన్నారు.

# సౌహార్ద్రత భంగానికి విపక్షాల కుట్ర: సిద్ధు

**మైసూరు, న్యూస్‌టుడే:** రాష్ట్రంలో చక్కని వర్షాలు కురవడం, అన్నదాతలు సంతోషంగా ఉండడంతో దసరా వేడుకలను ఘనంగా నిర్వహించేందుకు అవకాశం కలిగిందని ముఖ్యమంత్రి సిద్ధరామయ్య పేర్కొన్నారు. రాష్ట్రంలో అశాంతిని రేకెత్తించి, ప్రజల మధ్య సౌహార్ద్రతను పాడు చేసేందుకు కొందరు ప్రయత్నిస్తున్నారని విపక్ష నేతలను ఉద్దేశించి పరోక్ష వ్యాఖ్యలు చేశారు. అలాంటి వారికి అమ్మవారు సద్బుద్ధి ఇవ్వాలని ప్రార్థిస్తున్నానని చెప్పారు. మంత్రులు లక్ష్మీ హెబ్బాళ్కర్, మహదేవప్ప తదితరులతో కలిసి సుత్తూరు మఠానికి వెళ్లారు. మఠంలో అమ్మవారికి పూజ చేసుకున్నారు. దేశికేంద్ర స్వామి నుంచి సత్కారాన్ని అందుకుని మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం పన్ను వాటా విడుదలలో కర్ణాటకకు అన్యాయం చేస్తోందని ఆరోపించారు. కేంద్రం 28 రాష్ట్రాలకు రూ. 1,78,193 కోట్లు విడుదల చేయగా, కర్ణాటకకు కేవలం రూ.6,498 కోట్లు మాత్రమే విడుదల చేసిందన్నారు. దేశంలో అత్యధిక పన్ను వసూలు చేసి కేంద్రానికి అందిస్తున్న రాష్ట్రాల్లో రెండో స్థానంలో ఉన్న కర్ణాటకకు తక్కువ నిధులు విడుదల చేయడం కేంద్రం చూపిస్తున్న సవతి తల్లి ప్రేమకు ఉదాహరణ అన్నారు. దీనిపై భాజపా నాయకులు కేంద్రాన్ని ప్రశ్నించాలని డిమాండ్ చేశారు.



సిద్ధరామయ్యను సత్కరిస్తున్న శివరాత్రి దేశికేంద్ర స్వామి



హుబ్బళ్లి: కళసా బండూరి ప్రతినిధుల నుంచి వినతి పత్రాన్ని తీసుకుంటున్న సిద్ధరామయ్య

### ఆధారరహిత పోరాటాలు

**హుబ్బళ్లి:** భాజపా నాయకులు ఆధార రహిత పోరాటాలు, అబద్ధపు ప్రచారాలు చేయడంతో పాటు వదంతులను సృష్టించడంలో ముందుంటారని ముఖ్యమంత్రి సిద్ధరామయ్య ధ్వజమెత్తారు. హుబ్బళ్లిలో 2022లో జరిగిన మత ఘర్షణలకు సంబంధించి తప్పుడు ఆరోపణలు, తప్పుడు కేసులు నమోదై ఉంటే, వాటిపై చర్చించి కేసుల ఉపసంహకరణకు చర్యలు తీసుకునేందుకు మంత్రివర్గ ఉపసమితిని ఏర్పాటు చేశామన్నారు. అప్పటి అన్ని కేసులను ప్రభుత్వం రద్దు చేసిందంటూ భాజపా ప్రచారం చేస్తూ ధర్నాకు దిగడం సిగ్గు చేటన్నారు. హుబ్బళ్లిలో పోలీసుల నుంచి గౌరవ వందనాన్ని, కళసా బండూరి సాధన సమితి నుంచి వినతి పత్రాన్ని ఆదివారం అందుకుని మాట్లాడారు. విచారణలో ఏవైనా తప్పుడు కేసులు నమోదైనట్లు గుర్తిస్తే, న్యాయస్థానం దృష్టికి తీసుకువెళ్లి, వాటిని రద్దు చేస్తామన్నారు. ప్రభుత్వం నేరుగా కేసులను రద్దు చేయడం సాధ్యం కాదన్నారు. గతంలో భాజపా నాయకులపై నమోదైన తప్పుడు కేసులనూ రద్దు చేసిన విషయాన్ని గుర్తు చేశారు.

# చెరువుల దుస్థితిపై హరిత న్యాయస్థానం తాఖీదులు



విభూతిపుర చెరువు



దొడ్డనెక్కుంది చెరువు దుస్థితి

**బెంగళూరు (యశ్వంతపుర), న్యూస్‌టుడే:** రాష్ట్ర రాజధాని బెంగళూరు నగరంలోని విభూతిపుర, దొడ్డనెక్కుంది చెరువుల్లో నెలకొన్న మాలిన్యం, ఆక్రమణల గురించి చెన్నైలో ఉన్న దక్షిణాది హరిత న్యాయస్థానం, బృహత్ బెంగళూరు మహానగర, బెంగళూరు నగర జిల్లాధికారి, రాష్ట్ర మాలిన్య నియంత్రణ మండలికి తాఖీదులు జారీ చేసింది. రెండు చెరువులు ఐటీ కారిడార్ ప్రదేశంలో ఉన్నాయి. చుట్టూ ఐటీ పరిశ్రమలు, నివాస ప్రదేశాలు ఉన్నాయి. వాటిల్లో వచ్చే మురుగు నీరు నేరుగా చెరువుల్లోకి చేరడంతో అవి కాస్త మలినమవుతున్నాయి. ఫలితంగా భూగర్భ జలాలూ మాలిన్యం కావడంతో చుట్టు పక్కల ప్రజలు హరిత న్యాయస్థానానికి ఫిర్యాదు చేశారు. మురుగునీరు చెరువుల్లోకి రాకుండా నియంత్రించాలని, చెరువు ఆక్రమణలు తొలగించాలని తాఖీదులు ఇచ్చింది. పాడైన చెరువులను శుద్ధీకరించాలని ఆదేశాలు జారీ చేసింది. హరిత న్యాయస్థానం తాఖీదుకు సమాధానం ఇవ్వడంతోపాటు సూచించినట్లు రెండు చెరువులను బాగు చేస్తామని అధికారులు తెలిపారు.



అంబారీపై అమ్మవారికి ఉత్సవమూర్తికి శాల్యూట్ చేస్తున్న సిద్ధరామయ్య, మహదేవప్ప, శివరాజ్ తంగడగి, సీమా లాట్కర్ తదితరులు



శమీవృక్షానికి పూజ చేసేందుకు వెళుతున్న యదువీర కృష్ణదత్త ఒడెయరు



రాచవీధుల్లో వెళుతున్న జంబూ సవారీ



విద్యుత్తు కాంతులతో రాజప్రాసాదం ధగధగ

# అంబరమంటిన రాచనగరి సంబరం

**• ఆకట్టుకున్న జంబూ సవారీ**

## ముగిసిన వేడుకలు



ఓపెన్‌టాప్ వాహనంలో వెళుతూ గౌరవ వందనాన్ని స్వీకరిస్తున్న గవర్నర్ గహ్లోత్

**మైసూరు, న్యూస్‌టుడే:** బన్ని మండపం సమీపంలోని మైదానంలో శనివారం రాత్రి నిర్వహించిన కాగడాల ప్రదర్శనతో విశ్వవిఖ్యాత మైసూరు ఉత్సవాలకు తెరపడింది. శుక్ర, శనివారాల్లో కురిసిన వర్షానికి మైదానం కొంత చిత్తడిగా మారినా పాలికె సిబ్బంది యుద్ధ ప్రాతిపదికన మైదానాన్ని సిద్ధం చేశారు. మిలటరీ పోలీసులు బైకులపై మానవ పిరమిడ్‌ను ఏర్పాటు చేయడం, నిప్పుల రింగుల నుంచి బైకులను దూకించడం, ఒంటికాలిపై బైకులపై విన్యాసాలను ప్రదర్శించారు. మ్యూజికల్ రైడ్, టెంట్ పగ్గింగ్‌లకు కూడా చక్కని స్పందన లభించింది. అశ్వికదళ సిబ్బంది 30 గుర్రాలతో ప్రదర్శన ఇచ్చారు. కాగడాల ప్రదర్శనలో 300 మంది పోలీసులు 600 కాగడాలతో ప్రదర్శన ఇచ్చారు. రింగ్ రొటేషన్, సుదర్శన చక్రం, స్వస్తిక్, స్వాగతం, సువర్ణ కర్ణాటక 50, మైసూరు దసరా 414, జై చాముండి, కన్నడవేసత్య..కన్నడవే నిత్య, కర్ణాటక పోలీస్ ఆల్వేస్ విత్ యూ, జైహింద్, థ్యాంక్యూ తదతర అక్షరాల ఆకృతిలో నిలబడి ఇచ్చిన ప్రదర్శనలు అందరినీ ఆకట్టుకున్నాయి. పోలీసు దళాల నుంచి గవర్నర్ గౌరవ వందనాన్ని అందుకున్నారు.



కాగడాల ప్రదర్శన

**మైసూరు, న్యూస్‌టుడే:** విఖ్యాత మైసూరు దసరా ఉత్సవాల్లో భాగంగా శనివారం సాయంత్రం జంబూసవారీ ఘనంగా జరిగింది. ముఖ్యమంత్రి సిద్ధరామయ్య, మంత్రులు మహదేవప్ప, శివరాజ్ తంగడగి తదితరులు వేదికపై నుంచి చాముండి అమ్మవారి ఉత్సవ మూర్తికి గౌరవ వందనాన్ని సమర్పించారు. అంతకు మునుపు రాజ వంశస్థుడు యదువీర కృష్ణదత్త చామరాజ ఒడెయరు ప్యాలెస్ ఆవరణలోని జమ్మి చెట్టుకు పూజలు చేశారు. బలరామ ద్వారం వద్ద శనివారం మధ్యాహ్నం 1.41 నుంచి 2.10 మధ్యలో నంది ధ్వజానికి ముఖ్యమంత్రి పూజ చేశారు. ప్యాలెస్ ఆవరణలో రాజ ఏనుగు, గుర్రం, ఆవు, రాజ ఖడ్గాలకు యదువీర్ పూజలు చేశారు. రాజవంశస్థుల కోసం ప్యాలెస్ ఆవరణలో కుస్తీ పోటీలను ప్రత్యేకంగా ఏర్పాటు చేశారు. జంబూ సవారీతో పాటు వివిధ ప్రాంతాలకు చెందిన కళాకారులు తమ బృందాలతో కలిసి ఇచ్చిన ప్రదర్శనలు పర్యాటకులను, స్థానికులను ఆకట్టుకున్నాయి. భద్రతలో భాగంగా పోలీసులు మంచెలపై నుంచి, డ్రోన్ కెమెరాలతో పర్యవేక్షించారు. ఏనుగుల సంఖ్య ఎక్కువ కావడంతో రోహిత్, వరలక్ష్మి, దొడ్డహరవె లక్ష్మిలను ఈసారి జంబూసవారీకి తీసుకువెళ్లలేదు. తాలీము సందర్భంలో రోహిత్ ఎలాంటి కంగారు పడకుండా అభ్యాసం చేసిందని దాని మావటి సయ్యద్ ఉస్మాన్ తెలిపారు. కొత్త ఏనుగని నిరుడు, ఏనుగుల సంఖ్య ఎక్కువ అని ఈ ఏడాది దాన్ని జంబూ సవారీకి తీసుకెళ్లలేదన్నారు. వచ్చే ఏడాది కచ్చితంగా జంబూ సవారీలో పాల్గొనేందుకు అవకాశం దక్కుతుందని ఆయన ధీమా వ్యక్తం చేశారు. గత పాతికేళ్లుగా జంబూ సవారీలో పాల్గొంటున్న అభిమన్యు గత ఐదేళ్ల నుంచి బంగారు అంబారీని మోస్తోంది. అంబారీని మోసేందుకు ముందు, అనంతరం పలువురు పర్యాటకులు అభిమన్యును చూసేందుకు ఆసక్తి చూపించారు. అభిమన్యును ఏకే 47 అని మావటీలు పిలుచుకుంటారు. మహారాష్ట్ర, తమిళనాడు, కేరళ, మధ్యప్రదేశ్ రాష్ట్రాల్లోని అడవుల్లో ఏనుగులు, పులులను బంధించేందుకు అభిమన్యు సహకారాన్ని తీసుకున్నారు. అందుకే దాన్ని ఏకే 47 అని పిలుచుకుంటున్నామని మావటి వసంత్ తెలిపారు. దీపవు వెలుగుల్లో అంబారీలోని అమ్మవారి ఉత్సవమూర్తిని వీక్షించేందుకు భక్తులు పోటీపడ్డారు. చల్లని వరములు ఇవ్వమ్మా అని భక్తులు కోరుకున్నారు. అభిమన్యుపై ఏర్పాటు చేసేందుకు బంగారు అంబారీ ఇవ్వడానికి ప్యాలెస్ ప్రతినిధులు ఆలస్యం చేశారని కొందరు నేతలు చేసిన వ్యాఖ్యలను రాజమాత ప్రమోదాదేవి ఒడెయరు ఖండించారు. ఏటాలాగే ఈసారి మధ్యాహ్నం 2.02 నిమిషాలకు బంగారు అంబారీని అందించామని తెలిపారు. అంబారీని అందుకున్న సమయానికి సంబంధించి తాము ఇచ్చిన పత్రంపై ప్రభుత్వ ప్రతినిధులు సంతకం కూడా చేశారని తెలిపారు.



రాచనగరిలో ఉత్సవాలకు హాజరైన అశేష జనం

***అందరికీ ధన్యవాదాలు:*** మైసూరు దసరా ఉత్సవాలను క్రమశిక్షణతో, ఘనంగా ఆచరించేందుకు చర్యలు తీసుకున్న జిల్లా పాలన యంత్రాంగాన్ని, సహకారాన్ని అందించిన ప్రజలు పర్యాటకులకు ముఖ్యమంత్రి సిద్ధరామయ్య, ఉప ముఖ్యమంత్రి డీకే శివకుమార్ ధన్యవాదాలు తెలిపారు. చాముండేశ్వరికి ఎక్కువసార్లు పుష్పార్చన చేసే అదృష్టం తనకే దక్కిందని సిద్ధరామయ్య పేర్కొన్నారు. రద్దీని నియంత్రించేందుకు యువ దసరాను మొదటిసారి ఉత్తనహళ్లి వద్ద నిర్వహించడంతో ఎక్కువ మంది ప్రేక్షకులు కార్యక్రమాలకు హాజరయ్యారని తెలిపారు. సాంస్కృతిక నగరిగా గుర్తింపు పొందిన మైసూరులో సంగీతం, కళలు, వస్తు ప్రదర్శనలు, ఆహార మేళా, యోగా, కుస్తీ, క్రికెట్, ముగ్గుల పోటీలు తదితరాలకు ప్రజలు, పర్యాటకుల నుంచి చక్కని స్పందన లభించడంపై హర్షం వ్యక్తం చేశారు.

# ప్రియుడి మాయలో పడి బిడ్డల్ని కడతేర్చిన తల్లి

**రామనగర, న్యూస్‌టుడే:** భర్తను విడిచి పెట్టి, ప్రియునితో బెంగళూరుకు పరారైన ఒక మహిళ (24) తన ఇద్దరు బిడ్డలను హత్య చేసి శ్మశానవాటికలో పూడ్చి పెట్టింది. బెంగళూరు డీజే హళ్లిలో ఉంటున్న ఆమె తన మూడేళ్ల కుమారుడు, 11 నెలల కుమార్తెను హత్య చేసిందని గుర్తించారు. ట్యానరీ రోడ్డు ఏకే కాలనీకి చెందిన ఆమె తన 27 ఏళ్ల ప్రియునితో పరారైందని గుర్తించారు. కొద్ది రోజుల క్రితం ప్రియునితో పరారైన ఆమె రామనగర పరిధి ఐజూరులో ఇద్దరు పిల్లలతో కలిసి ప్రియునితో కాపురం పెట్టింది. అక్టోబరు ఒకటో తేదీన ఒక బిడ్డ మరణించిందని స్థానిక శ్మశానవాటికకు తన ప్రియునితో కలిసి వెళ్లి అంత్యక్రియలు చేసింది. మళ్లీ అక్టోబరు 7న ఇంకో బిడ్డ మరణించిందని అంత్యక్రియలు చేసి వచ్చింది. అనుమానం వచ్చిన అక్కడి కాపలాదారు ఆ మహిళ, ఆమె ప్రియుడు ఫొటోలను తన చరవాణిలో తీసి పోలీసులకు అందించడంతో ఈ హత్యలు వెలుగులోకి వచ్చాయి. పరారీలో ఉన్న ఆ మహిళ, ఆమె ప్రియుని కోసం గాలింపు తీవ్రం చేశారు.

# యువకుడిపై కాల్పులు

**మండ్య, న్యూస్‌టుడే:** తన భార్యతో వివాహేతర సంబంధాన్ని పెట్టుకున్నాడన్న అనుమానంతో మంజునాథ్ (29) అనే యువకునిపై శివరాజు (37) తుపాకీతో ఆదివారం కాల్పులు జరిపాడు. తన స్నేహితులతో కలిసి ఇంటి ముందు కూర్చున్న మంజు వద్దకు వచ్చి రెండు రౌండ్లు కాల్పులు జరిపాడు. పాండవపుర తాలూకా శంభూవినహళ్లి గ్రామంలో ఈ ఘటన చోటు చేసుకుంది. ఒక తూటా గోడకు తగలగా, రెండోది అతని నుదుటికి ఒక పక్క తాకింది. స్థానిక ఆసుపత్రిలో ప్రథమ చికిత్స ఇప్పించి, మైసూరు కేఆర్ ఆసుపత్రికి బాధితుడ్ని తరలించారు. అతని పరిస్థితి విషమంగా ఉందని వైద్యులు తెలిపారు. శివరాజు కోసం పోలీసులు గాలింపు తీవ్రం చేశారు.


గేట్ల గుండా నది వైపు పరుగులు తీస్తున్న తుంగభద్ర జలాలు


కంప్లి కోటె వద్ద తుంగభద్రమ్మ పరవళ్లు

# తుంగభద్రకు వరద పోటు

● నదికి 78 వేల క్యూసెక్కులు

**హొసపేటె, న్యూస్‌టుడే:** తుంగభద్ర ఎగువ ప్రాంతాలతో పాటు స్థానికంగా కురుస్తున్న వర్షాలకు వరద పోటెత్తింది. ఈ నేపథ్యంలో అధికారులు జలాశయంలోని 20 గేట్లను పైకెత్తి 78 వేల క్యూసెక్కుల నీటిని నదికి విడుదల చేశారు. కాలువల గుండా మరో 10 వేల క్యూసెక్కుల నీరు బయటకు పారుతోంది. జలాశయానికి సుమారు 88 వేల క్యూసెక్కుల వరకు వరద వచ్చి చేరుతోంది. జలాశయంలో 101.656 టీఎంసీలు నిల్వ చేసుకొని వరద నీటిని వచ్చినట్లే బయటకు విడుదల చేస్తున్నారు. ఈ సంవత్సరంలో జలాశయం గేట్ల గుండా నదికి నీటిని విడుదల చేయడం ఇది మూడోసారి కావడం గమనార్హం.

**కంప్లి, న్యూస్‌టుడే:** తుంగభద్రకు వరదతో జలాశయం నుంచి నదికి ఆదివారం ఉదయం 78వేల క్యూసెక్కుల నీరు వదిలారు. కంప్లి కోటె వంతెన వద్ద తుంగభద్రమ్మ పరవళ్లు తొక్కుతోంది. మరింత ప్రవాహం పెరిగితే గంగావతి- కంప్లి మార్గంలో రాకపోకలు నిలిపేస్తామని గంగావతి ప్రజా పనుల శాఖ అధికారులు తెలిపారు. వరద అధికంగా రావడంతో కంప్లి నుంచి మణ్ణూరు-సూగూరు వరకు నది పక్కనున్న రైతుల వ్యవసాయ మోటార్లు నీటిలో మునిగిపోయాయి. అక్టోబరు నెలలో తుంగభద్రకు ఇలా వరద రావడం గత 15 ఏళ్లలో ఇది రెండోసారి. 2009 అక్టోబరు 3న కోటె వంతెన వరద నీటిలో మునిగి రాకపోకలకు అంతరాయం ఏర్పడిన విషయం తెలిసిందే.

# భార్య ప్రియుడిని చంపిన భర్త

**హొసపేటె, న్యూస్‌టుడే:** తన భార్యతో వివాహేతర సంబంధం ఉందన్న అనుమానంతో ఆమె భర్త ఫక్కీరస్వామి బసవరాజ్ (26) అనే యువకుడిని గ్రామ నడిబొడ్డున గొడ్డలితో నరికి చంపిన ఘటన శనివారం హగరిబొమ్మనహళ్లి తాలూకా చిలుగోడులో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. తన భార్యతో బసవరాజ్‌కు వివాహేతర సంబంధం ఉందని ఫక్కీరస్వామి కోపంతో రగిలిపోతున్నారు. ఇదిలా ఉండగా మూడు నెలల క్రితం ఉన్నట్టుండి బసవరాజ్, ఫక్కీరస్వామి భార్య అదృశ్యమయ్యారు. నెల రోజుల తర్వాత ఆమె తిరిగి వచ్చి భర్తతో కలిసి ఉంటోంది. ఈ నేపథ్యంలో ఫక్కీరస్వామి కక్ష పెంచుకొని అవకాశం కోసం కాచుకొని ఉన్నారు. దసరా రోజు గ్రామ నడిబొడ్డున ఒంటరిగా ఉన్న బసవరాజ్‌ను చూసి గొడ్డలితో దాడిచేసి నరికి చంపాడు. అనంతరం పోలీసు స్టేషన్‌కు వెళ్లి లొంగి పోయారు. ఘటనా స్థలాన్ని హగరిబొమ్మనహళ్లి సీఐ వికాస్‌లమాణి, తంబ్రహళ్లి ఎస్సై గురుచంద్ర పరిశీలించి వివరాలు సేకరించారు. కేసు దర్యాప్తులో ఉంది.


ఘటనా స్థలంలో వివరాలు సేకరిస్తున్న సీఐ వికాస్ లమాణి

## దేవరగట్టు ఉత్సవానికి వెళుతూ..

# ముగ్గురు బళ్లారి యువకుల దుర్మరణం

**బళ్లారి, ఆలూరు గ్రామీణ, హొలహర్వి, న్యూస్‌టుడే:** ఆంధ్రప్రదేశ్‌లోని కర్నూలు జిల్లా దేవరగట్టు బన్ని ఉత్సవాన్ని తిలకించేందుకు వెళుతూ జరిగిన ప్రమాదంలో ముగ్గురు బళ్లారి యువకులు మృతి చెందారు. ఈ ఘటన ఆలూరు మండలం కరడిగుడ్డం గ్రామ సమీపంలో చోటు చేసుకుంది. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల మేరకు..

కర్ణాటకలోని బళ్లారి జిల్లా తగ్గినబూదేహళ్లి గ్రామానికి చెందిన హరీష్ (26), రవి (27), మల్లికార్జున (26)లు ద్విచక్ర వాహనంపై హొళగుంద మండలం దేవరగట్టులో జరిగే బన్ని ఉత్సవాన్ని తిలకించేందుకు శనివారం రాత్రి బయలు దేరారు. అర్ధరాత్రి సమయంలో ఆలూరు తాలూరా కరడిగుడ్డ గ్రామ సమీపంలో వారి ద్విచక్ర వాహనం అదుపుతప్పి సమీప కొండను ఢీకొన్నారు. తీవ్రంగా గాయపడిన హరీష్, మల్లికార్జున అక్కడికక్కడే చనిపోయారు. బలమైన దెబ్బలు తగిలిన రవిని చికిత్స నిమిత్తం బళ్లారి బీఎంసీఆర్‌సీలోని ట్రామాకేర్‌కు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందాడు. సమాచారం అందుకున్న ఆలూరు పోలీసులు ఘటనా స్థలికి చేరుకుని హరీష్, మల్లికార్జున మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం ఆలూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. చేతికంది వచ్చిన ముగ్గురు కొడుకులు ప్రమాదంలో మృతి చెందడంతో ఆయా కుటుంబాలు శోకసంద్రంలో మునిగిపోయాయి. ఆ మూడు కుటుంబాలకు ఒక్కొక్క కుమారుడే కావడంతో ఆ తల్లిదండ్రుల రోదనలను ఆపడం ఎవరి తరం కాలేదు. మృతుల బంధువుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు వెల్లడించారు.


హరీష్


మల్లికార్జున


రవి

# నేడు ముఖ్యమంత్రి సిద్ధరామయ్య రాక

● వివిధ అభివృద్ధి పనులకు భూమిపూజ

**బళ్లారి, న్యూస్‌టుడే:** రాష్ట్రంలో ఇంటింటికీ ఐదు గ్యారంటీలను చేర్చిన ముఖ్యమంత్రి సిద్ధరామయ్య 14న సండూరు పట్టణానికి రానున్నట్లు కార్మిక శాఖ మంత్రి సంతోష్ ఎస్.లాడ్ తెలిపారు. సీఎం పర్యటన నేపథ్యంలో శనివారం జిల్లా సంకీర్ణ భవనంలో ఏర్పాటు చేసిన సమావేశంలో మంత్రి పాల్గొని మాట్లాడారు. ముఖ్యమంత్రి మొదటిసారిగా సండూరు పట్టణానికి రానున్నారని, అనేక కార్యక్రమాలు, వివిధ అభివృద్ధి పనులకు భూమిపూజ చేస్తారని, జిల్లా యంత్రాంగం పూర్తిగా సహకరించాలని కోరారు. ఏపీఎంసీ పాఠశాల ఆవరణలో బహిరంగ సమావేశం ఉంటుందని, మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, లోక్‌సభ, రాజ్యసభ ఎంపీలు, నాయకులు పెద్ద సంఖ్యలో పాల్గొంటారన్నారు. పోలీసులు గట్టి బందోబస్తు ఏర్పాటు చేయాలని సూచించారు. వేదిక ఏర్పాటు, పథకాల లబ్ధిదారులు, వివిధ జిల్లాల నుంచి వచ్చే ప్రజలకు ఆహారం, తాగునీటి వ్యవస్థ, సామూహిక మరుగుదొడ్ల తదితర వసతుల కల్పనపై అధికారులతో చర్చించారు.



సమావేశానికి హాజరైన మంత్రి సంతోష్, చిత్రంలో మేయర్ నందీష్, డీసీ ప్రశాంత్‌కుమార్, జడ్పీ సీఈవో రాహుల్ శరణప్ప, ఎస్పీ శోభారాణి తదితరులు

### పథకాలపై ప్రచారం చేయాలి

సీఎం ప్రవేశపెట్టిన ఐదు గ్యారంటీ పథకాలతో పాటు ఇతర పథకాలకు సంబంధించిన లబ్ధిదారుల వివరాలు, చిత్రాలను వేదిక వద్ద ప్రదర్శించాలని అధికారులకు సూచించారు. వ్యవసాయ, ఉద్యానవన, జడ్పీ, వివిధ శాఖల నుంచి లబ్ధి పొందిన వారి వివరాలు సిద్ధంగా ఉంచుకోవాలన్నారు. సమావేశానికి తరలివచ్చే కార్యకర్తలు, లబ్ధిదారులు, అభిమానుల కోసం మొత్తం 700 బస్సు సర్వీసులు అందుబాటులో ఉంచాలన్నారు. రాష్ట్ర మండలి అధ్యక్షుడు ముండరగి నాగరాజ, గ్యారంటీ యోజనాలు అనుష్ఠాన ప్రాధికార రాష్ట్ర ఉపాధ్యక్షుడు మహరూజ్‌ఖాన్, మేయర్ ముల్లంగి నందీష్, కలెక్టర్ ప్రశాంత్‌కుమార్ మిశ్రా, జడ్పీ సీఈవో రాహుల్ శరణప్ప సంకనూర, ఎస్పీ శోభారాణి, ఏడీసీ మహమ్మద్ ఝుబేర తదితరులు పాల్గొన్నారు.

### కార్యక్రమాలు వివరాలు

ముఖ్యమంత్రి 14న ఉదయం 10 గంటలకు బెంగళూరు హెచ్‌ఏఎల్ విమానాశ్రయం నుంచి ప్రత్యేక విమానంలో బయలుదేరి ఉదయం 10.50 గంటలకు తోరణగల్లు సమీప జిందాల్ విమానాశ్రయం చేరుకుంటారు. అక్కడి నుంచి రోడ్డు మార్గంలో ఉదయం 11.15 గంటలకు సండూరు పట్టణంలో జరిగే బహిరంగ సభలో పాల్గొంటారు. వేదికపై నుంచి వివిధ అభివృద్ధి పనులను ప్రారంభిస్తారు. మధ్యాహ్నం 3.55 గంటలకు జిందాల్ విమానాశ్రయం నుంచి బెంగళూరుకు ప్రత్యేక విమానంలో బయలుదేరి వెళతారు.

# వరుణుడి ప్రతాపం

● నీట మునిగిన కాలనీలు

**హొసపేటె, న్యూస్‌టుడే:** విజయనగర జిల్లాను వరుణుడు కుదిపేశాడు. శనివారం రాత్రి కురిసిన భారీ వర్షాలకు హొసపేటె, కొట్టూరు, కూడ్లిగి, హరపనహళ్లి తాలూకా ప్రజల జీవనం అస్తవ్యస్తమైంది. హరపపనహళ్లి తాలూకాలో భారీ నష్టం వాటిల్లింది. సుమారు పది ఇళ్లు పాక్షికంగా దెబ్బతిన్నాయి. బండ్రితండా, ఉత్తంగి, గజాపుర, కూలహళ్లి, బసవనాళ్ గ్రామాల్లో ఇళ్లు నేలకూలాయి. లక్ష్మీపురలో పిడుగుపడి ఓ ఆవు మృతి చెందింది. మాదాపుర, కూలహళ్లి, అయ్యనకెరె చెరువులు పొంగిపొర్లాయి. కొట్టూరు తాలూకాలో కూడా చెరువులు మరవ పారాయి. జరిగిన నష్టాన్ని రెవెన్యూ అధికారులు అంచనా వేస్తున్నారు.


హరపనహళ్లి తాలూకా హగరిగజాపురలో కూలిన పిట్టగోడ

**చెళ్లకెర (చిత్రదుర్గం), న్యూస్‌టుడే:** చెళ్లకెర పట్టణం, పరిసర గ్రామాల్లో శుక్ర, శనివారాల్లో కురిసిన భారీ వానలకు పలు కాలనీలు నీట మునిగాయి. బళ్లారి మార్గంలోని అభిషేక్ నగర్‌లోని 50 షెడ్డులు, పావగడ రహదారిలోని మైరాడా కాలనీలోని 30 గుడిసెల్లో నీరు చేరింది. అర్ధరాత్రి కావడంతో ఆయా కుటుంబాలు నానా అవస్థలు పడ్డారు. రాజ కాలువ పరిసరాల్లో నిర్మించుకున్న ఇళ్లలోని వరద నీరు ప్రవహించింది. ధాన్యం బస్తాలు, దుస్తులు, పాత్రలు, పిల్లల పుస్తకాలు, సామగ్రి తడిసి ముద్దయ్యాయి. కాలువ చిన్నది కావడంతో వరద నీరు ఒక్కసారిగా పొంగడంతో ఇబ్బందులు తప్పలేదని బాధితుడు రంగప్ప వాపోయారు. పలు రోడ్లు మునిగిపోవడంతో రాకపోకలకు అవస్థలు పడినట్లు వాహనచోదకులు ఆవేదన వ్యక్తం చేశారు. ఆదివారం బాధిత ప్రాంతాలను సందర్శించిన తహసీల్దారు రెహాన్ పాషా జేసీబీ యంత్రాలను తెప్పించి వరద నీరు పోవడానికి కాలువలు తీయించారు. వారికి తాత్కాలిక సహాయం చేస్తామని హామీ ఇచ్చారు. తాలూకాలోని వరవు గ్రామ చెరువు, దొడ్డేరి చెరువులు నిండిపోయి మరవ పారడంతో పలుచోట్ల పంటల పొలాలు ముంపునకు గురయ్యాయి. రాణి చెరువుకు పెద్ద ఎత్తున వరద నీరు చేరింది.


చెళ్లకెర పట్టణ శివారులో వరద నీటితో మునిగిన రహదారి


చెళ్లకెరలోని మైరాడా కాలనీలో మునిగిన ధాన్యం బస్తాలు

# భళా..బాగవ్వ!

**బెళగావి, న్యూస్‌టుడే:** భాగ్యలక్ష్మి పథకంలో ప్రభుత్వం ప్రతి నెలా ఇస్తున్న రూ.2 వేల నగదు, ఇప్పటి వరకు తాను కూడగట్టుకున్న నగదుతో కలిసి బాగవ్వ నీలప్ప సణ్ణక్కి అనే మహిళ తన కుమారుడు రమేశ్‌కు బైకు కొనిచ్చారు. గోకాక్ తాలూకా కౌజలగి గ్రామానికి చెందిన ఆమె తన కోడలు లక్ష్మిని, కుమారుడ్ని తీసుకుని షోరూమ్‌కు వచ్చి బైకు కొనుగోలు చేసుకున్నారు. ఈ బైకు రూ.1.18 లక్షలు కాగా, తల్లి రూ.20 వేలు, భార్య రూ.20 వేలు ఇచ్చారని, మిగిలిన మొత్తాన్ని తాను సమకూర్చుకున్నానని రమేశ్ తెలిపారు.



కుమారునికి తాళం చెవి నమూనా అందిస్తున్న బాగవ్వ

# శెభాష్..మాళవీ !

**బెంగళూరు(యశ్వంతపుర),న్యూస్‌టుడే:** రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ఐదు గ్యారంటీ పథకాల్లో ఒకటైన గృహలక్ష్మీ పథకం ద్వారా లబ్ధిపొందిన ఓ మహిళ తన స్వగ్రామంలో పోటీ పరీక్షలకు హాజరవుతున్న విద్యార్థుల కోసం పోటీ గ్రంథాలయాన్ని ఏర్పాటు చేసి ఇతరులకు ఆదర్శంగా నిలిచారు. బెళగావి జిల్లా రాయబాగ తాలూకా మంటూరు గ్రామ పంచాయతీ సభ్యురాలు మాళవీ బొమ్మప్పమెట్రి గృహలక్ష్మీ పథకం ద్వారా ఏడాది పాటు పొందిన రూ.24 వేలను సొంత వాటికి ఖర్చు చేయలేదు. గ్రామంలో వివిధ పోటీపరీక్షలకు సిద్ధమవుతున్న విద్యార్థులు చాలామంది ఉన్నారు. పుస్తకాల కోసం సమీపంలో ఉన్న రాయబాగ పట్టణం లేకపోతే బెళగావి నగరానికి వెళ్తున్నారు. కొందరు ముంబయి, బెంగళూరు నగరాల్లోకి వెళ్లి పోటీ పరీక్షలకు సిద్ధపడుతున్నారు. నెలకొన్న సమస్యను గ్రహించిన ఆమె గృహలక్ష్మీ పథకం ద్వారా వచ్చిన నగదుతో చిన్న గది నిర్మించి అందులో పోటీ పుస్తకాలు కొనుగోలు చేసి ఉంచారు. గృహలక్ష్మీ పథకం నగదుతో పాటు కొంత తన సొంతడబ్బులు ఖర్చు చేశారు. విద్యార్థులు పడుతున్న ఇబ్బందులను గమనించి పరిష్కరించేందుకు ఆ పథకం ద్వారా వచ్చిన నగదును గ్రంథాలయం కోసం వ్యయం చేసినట్లు ఆమె తెలియజేశారు.


గ్రంథాలయం లోపల పుస్తకాలను సమకూర్చిన గ్రామ పంచాయతీ సభ్యురాలు మాళవీ బొమ్మప్పమెట్రి

# పులి నృత్యం.. సంభ్రమాశ్చర్యం



వేదికపై నటులు నవీన్ శంకర్, డాలీ ధనుంజయ, యశ్ శెట్టి తదితరులు

**మంగళూరు, న్యూస్‌టుడే:** నవరాత్రి వేడుకలు వస్తే తీర ప్రాంత జిల్లాల్లో పిలి డ్యాన్స్ (పులి డ్యాన్స్) ప్రదర్శనలు ఉంటాయి. పులి వేషాలు ధరించి ఇచ్చే ప్రదర్శనల ఉత్సవాన్ని 'మార్నెమి'గా వ్యవహరిస్తారు. వీధుల్లో మైదానాల్లో ఆడిటోరియాల్లో పులి వేషధారులు పోటీ పడతారు. ఉత్తమ ప్రదర్శనలకు చక్కని బహుమతులు ఉంటాయి. నవరాత్రి ప్రారంభం రోజున ఒంటికి రంగు వేసుకునే కళాకారులు విజయదశమి పూర్తయ్యే వరకు రంగులు తీయరు. ఇటీవలి కాలంలో పురుషులతో పాటు మహిళలు కూడా ముందుకు వస్తున్నారు. ఒంటికి స్వయంగా రంగు వేసుకోవడం నుంచి ఇతర బృందాలతో కలిసి అడుగు వేయడం, నృత్యం చేసేందుకు ఒక నెలకు పైగా అభ్యాసాన్ని చేస్తుంటారు. గ్రామాలు, పట్టణాల్లో ఇంటింటికీ వెళ్లి కొంత సేపు నృత్యం చేసి, స్థానికులు ఇచ్చే గౌరవ ధనాన్ని, కానుకలను తీసుకువెళ్లే బృందాలు దక్షిణ కన్నడ, ఉడుపి జిల్లాల్లో అనేకం ఉన్నాయి. ఆయా ప్రాంతాల్లో నిర్వహించిన పులి డ్యాన్స్‌లను బాలీవుడ్ నటుడు సంజయ్ దత్, స్యాండల్‌వుడ్ నటులు నవీన్ శంకర్, డాలీ ధనుంజయ, యశ్ శెట్టి, క్రికెటర్ శివం దూబే తదితరులు వీక్షించారు. మంగళూరులో నిర్వహించిన పోటీలను వీక్షించిన శివం దూబే ప్రేక్షకులను ఉద్దేశించి 'ఎంచ ఉల్లర్' (ఎలా ఉన్నారు) అని తుళు భాషలో పలకరించడంతో స్థానికుల నుంచి చక్కని స్పందన లభించింది. ఫ్రెండ్స్ బల్లాల్ బాగ్ బిరువెర్ కుడ్ల సంస్థ ఏర్పాటు చేసిన పులివేషాల పోటీలకు చక్కని స్పందన లభించింది. తమ సంస్థ పదవ ఏడాది నిర్వహించిన పోటీల్లో పాల్గొనేందుకు వివిధ ప్రాంతాల్లో స్థిరపడిన కళాకారులు వచ్చారని సంస్థ వ్యవస్థాపకుడు ఉదయ్ పూజారి తెలిపారు.


పులి డ్యాన్స్ వీక్షిస్తున్న బాలీవుడ్ నటుడు సంజయ్ దత్


పులి నృత్యం చేస్తున్న కళాకారులు

# యువకుడి ప్రాణం తీసిన సెల్ఫీ మోజు

**హొసపేటె, న్యూస్‌టుడే:** గండి పడిన చెరువు గట్టుపై స్నేహితులతో కలిసి సెల్ఫీ దిగుతూ చేతన్‌కుమార్(21) అనే యువకుడు కాలుజారి చెరువులో పడి మృతి చెందిన ఘటన కూడ్లిగి తాలూకా గండబొమ్మనహళ్లిలో శనివారం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం. కె.దిబ్బదహళ్లికి చెందిన చేతన్‌కుమార్ స్నేహితులతో కలిసి గండి పడిన గండబొమ్మనహళ్లి చెరువు వద్దకు వచ్చారు. అక్కడ సెల్ఫీ తీసుకుంటూ చెరువులో పడిపోయాడు. స్థానికులు రక్షించే ప్రయత్నం చేసినా ఫలితం లేకపోయింది. ఈ ఘటనతో పండగ రోజున ఆ యువకుడి కుటుంబంలో విషాదం అలముకుంది. కూడ్లిగి పోలీసులు ఘటనా స్థలాన్ని పరిశీలించారు. కేసు దర్యాప్తులో ఉంది.

# అన్నదాత బలవన్మరణం

**చెళ్లకెర (చిత్రదుర్గం), న్యూస్‌టుడే:** వ్యవసాయ అప్పులు తీర్చలేక క్యాదిగ్గెరె గ్రామానికి చెందిన రైతు విశ్వనాథ్ (54) పురుగు మందు తాగి ఆత్మహత్యకు పాల్పడిన ఘటన శనివారం రాత్రి జరిగిందని పోలీసు అధికారులు తెలిపారు. విశ్వనాథ్ వ్యవసాయ పనుల కోసం బ్యాంకులో రూ.1.20 లక్షలు, చేతి బదులుగా రూ.6 లక్షలు అప్పు చేశారు. రెండు ఎకరాల్లో ఉల్లి, 2 ఎకరాల్లో చేమంతి, మూడు ఎకరాల్లో మొక్కజొన్న సాగు చేశారు. ప్రతికూల వాతావరణంతో పంటలు ఎండిపోయి నష్టం వాటిల్లింది. చేసిన రుణం తీర్చే మార్గం కనబడక మనస్తాపంతో పొలంలో పురుగు మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డారని పోలీసులు వెల్లడించారు. రూరల్ ఠాణాలో కేసు నమోదైంది.

# ముడి ఇనుము తరలింపు: 5 లారీలు స్వాధీనం

**చెళ్లకెర (చిత్రదుర్గం), న్యూస్‌టుడే:** అనుమతి లేకుండా ముడి ఇనుము తరలిస్తున్న 5 లారీలను అటవీ అధికారులు స్వాధీనం చేసుకున్న సంఘటన దిండదహళ్లి గ్రామం వద్ద శనివారం చోటుచేసుకుంది. ఆదివారం పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. దిండదహళ్లి గ్రామం వద్ద పంటపొలాల మధ్య ముడి ఇనుప ఖనిజాన్ని తరలించే లారీలు తిరుగుతుండడంతో అన్నదాతలు ఆందోళనకు దిగారు. అటవీ శాఖ అధికారులకు సమాచారాన్ని అందించారు. వారు అక్కడికి చేరుకొని వివరాలు ఆరా తీయగా ఇనుప ఖనిజాన్ని తరలించేందుకు లారీలకు ఎలాంటి అనుమతులు లేవని తేలింది. స్థానిక పోలీసుల సాయంతో వాటిని స్వాధీనం చేసుకొని గనులు, భూగర్భ వనరుల అధికారులకు అప్పగించారు. రూరల్ పోలీసు ఠాణాలో కేసు నమోదైంది.



# చికిత్స పొందుతూ బాలుడి మృతి

● వైద్యుల నిర్లక్ష్యమంటూ ఆందోళన


బాలుడు ప్రజ్వల్

**హొసపేటె, న్యూస్‌టుడే:** జ్వరం లక్షణాలతో హొసపేటెలోని ఐ కేర్ ఆసుపత్రిలో చికిత్స కోసం చేరిన బాలుడు ప్రజ్వల్ (13) ఆదివారం రాత్రి చనిపోయాడు. వైద్యుల నిర్లక్ష్యంతోనే తమ కొడుకు మృతి చెందాడంటూ బాలుడి తల్లిదండ్రులు, బంధువులు మృతదేహాన్ని ఆసుపత్రి ముందుంచి ఆందోళన చేపట్టడంతో ఆ ప్రాంతంలో తీవ్ర ఉద్రిక్తత నెలకొంది. స్థానికులు తెలిపిన మేరకు వివరాలు.. హొసపేటె తాలూకా మరియమ్మనహళ్లివాసి పంపాపతి కుమారుడు ప్రజ్వల్ 12న జ్వరం లక్షణాలతో ప్రైవేటు ఆసుపత్రిలో చేరాడు. ఆదివారం మధ్యాహ్నం కోలుకున్న బాలుడు రాత్రి చనిపోవడంతో వైద్యుల నిర్లక్ష్యమే కారణమని తల్లిదండ్రులు ఆరోపించారు. ఆసుపత్రిలో చేరే సమయంలో బాలుడి దేహంలో రక్త కణాలు తక్కువగా ఉన్నాయని, రెండు రోజులు మెరుగైన వైద్యం అందించామని వైద్యులు తెలిపారు. బాలుడి ఊపిరి తిత్తుల్లో నీరు చేరుకొని మృతి చెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. ఇందులో తమ నిర్లక్ష్యం లేదని స్పష్టం చేశారు. ఆందోళన సమాచారం అందుకున్న తాలూకా వైద్యశాఖ అధికారి డాక్టర్ భాస్కర్, బడావణె పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని విచారణ చేపట్టారు.

# ఉగ్రావతార టీజర్ విడుదల

**బెంగళూరు(యశ్వంతపుర),న్యూస్‌టుడే:** ప్రముఖ హీరోయిన్ ప్రియాంక ఉపేంద్ర ప్రధాన పాత్ర పోషిస్తున్న మహిళ కథ ప్రధానంగా నిర్మిస్తున్న 'ఉగ్రావతార' చిత్రం టీజర్‌ను ప్రముఖ హీరో ఉపేంద్ర విడుదల చేశారు. మహిళలపై జరుగుతున్న అత్యాచారాలు, దౌర్జన్యాల నియంత్రణకు పోలీసులు చేపట్టిన స్వయం రక్షణ చర్యలు, సురక్ష యాప్ తదితర పని విధానంతో పాటు జరుగుతున్న దౌర్జన్యాల నుంచి మహిళలు ఎలా కాపాడుకోవాలనే అంశాలపై చిత్రాన్ని నిర్మిస్తున్నట్లు దర్శకుడు గురుమూర్తి తెలిపారు. రోబోగణేష్, లత, దర్శన్ సూర్య, లక్ష్మిశెట్టి, చరణ్, లీలా మోహన్, కార్యన్ నటిస్తుండగా కృష్ణబస్రూరు సంగీతాన్ని అందిస్తున్నారు.


ఉగ్రావతార చిత్రం టీజర్ విడుదల కార్యక్రమంలో ప్రముఖ సినీనటులు ఉపేంద్ర, ప్రియాంక ఉపేంద్ర, రోబోగణేష్, లత, దర్శన్ తదితరులు


సింహరూపిణి చిత్ర బృందం

# 17న సింహరూపిణి రాక

శ్రీచక్రఫిలింస్ బ్యానర్‌పై ఈనెల 17న 'సింహరూపిణి' చిత్రం రాష్ట్ర వ్యాప్తంగా విడుదల కానుంది. గ్రామీణులకు కష్టాలు ఎదురైతే గ్రామదేవతలను పూజించడంతో పాటు జాతర్లు నిర్వహిస్తారు. తద్వారా గ్రామాలకు జరుగుతున్న మంచి అంశాల ఆధారంగా చిత్రాన్ని నిర్మించినట్లు దర్శకుడు కిన్నాళ్ రాజ్ తెలిపారు. ఏడు పాటలకు జన్‌కరణ్ సింగ్ గానం అందించారు. యశ్‌శెట్టి, అంకితా గౌడ, దివ్యాఅలూరు, నీవాసం అశ్వత్, హరీశ్‌రాయ్, విజయ్‌చెందూరు, యశస్విని, అరవ్ లోహిత్ తదితరులు నటిస్తున్నారు.


మర్యాద ప్రశ్నె చిత్రంలో రాకేశ్ అడిగ, సునీల్‌రావ్, శైన్ శెట్టి తదితరులు

# నవంబరు 22న 'మర్యాద ప్రశ్నె'

సమాజంలో జరుగుతున్న విభిన్నమైన సంఘటన ఆధారంగా నిర్మిస్తున్న 'మర్యాద ప్రశ్నె' చిత్రం నవంబరు 22న రాష్ట్రవ్యాప్తంగా విడుదల కానుంది. చిత్రం అన్నివర్గాలను ఆకట్టుకుంటుందని దర్శకుడు నాగరాజు సోమయాజి తెలిపారు. రాకేశ్ అడిగ, సునీల్‌రావ్, శైన్‌శెట్టి, తేజు బెళవాడి, పూర్ణచంద్ర మైసూరు, ప్రభుముండ్కర్, రేఖాకుడ్లిడి, నాగేంద్ర, శ్రవణ్ తదితరులు నటిస్తున్నారు.

# సంతోష్ సంగీత సిద్ధం

అర్నవ్ విన్యాస్, రాణివరద్ కలిసి నటిస్తున్న 'సంతోష్ సంగీత' చిత్రీకరణ పూర్తి చేసుకుని విడుదలకు సిద్ధంగా ఉంది. ప్రముఖ లహరి కంపెనీ యజమాని లహరి వేలు తదితరులు కలిసి టీజర్‌ను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయనను చిత్రబృందం సత్కరించారు. ప్రేమ, హాస్యంతో కూడిన చిత్రమని హీరో అర్నవ్ విన్యాస్ తెలిపారు. దొడ్డణ్ణ, అవినాశ్, లయకోకిల, కవన, అమిత్, లోకేశ్‌సూర్య తదితరులు నటిస్తున్నారు.


సంతోష్ సంగీత చిత్రం టీజర్ విడుదల సందర్భంగా లహరి వేలుకు సత్కారం



## ఆంజనేయుడికి వెండి ఆభరణాలు

తాలూకాలోని కొత్తలచింత గ్రామంలోని ఆంజనేయ ఆలయంలో స్వామి విగ్రహానికి నూతన వెండి ఆభరణాలను అలంకరించారు. దశమి పురస్కరించుకుని భక్తులు రూ.7 లక్షలతో భక్తులు వెండి ఆభరణాలు తయారుచేసి తెచ్చారు. ముత్తయిదువలు కలశాలు, వాద్య వృందాలు స్వాగతం పలికి ఊరేగింపుగా ఆలయానికి తీసుకొచ్చి స్వామికి అలంకరించి పూజలు చేశారు. -న్యూస్‌టుడే, సిరుగుప్ప

# బళ్ళారి

•బళ్ళారి •రాయచూరు

## కనువిందుగా ఆర్‌ఎస్‌ఎస్ కవాతు



విజయదశమి పురస్కరించుకుని గంగావతి పట్టణంలో ఆర్‌ఎస్‌ఎస్ కార్యకర్తలు ఆదివారం నిర్వహించిన కవాతు అలరించింది. చెన్నబసవస్వామి ఆలయం నుంచి ప్రారంభమైన కవాతు గ్రామ దేవత దుర్గమ్మ ఆలయం మీదుగా కృష్ణదేవరాయ కూడలి, కొట్టూరేశ్వర ఆలయం మైదానం వరకు సాగింది. ఈ సందర్భంగా గాంధీ కూడలిలో శాసనసభ్యుడు గాలి జనార్దన్‌రెడ్డి ఆర్‌ఎస్‌ఎస్ కార్యకర్తలపై పుష్పవర్షం కురిపించారు. మహిళలో రంగవల్లికలు వేసి స్వాగతం పలికారు. నగరసభ అధ్యక్షుడు మౌలాసాబ్ పాల్గొన్నారు. -న్యూస్‌టుడే, గంగావతి



బళ్లారి గ్రామీణ: మహిషాసుర మర్దనిగా సంతోషిమాత



బళ్లారి గ్రామీణ: వాసవీమాతకు సువర్ణ కవచ అలంకారం



బళ్లారి గ్రామీణ: రజత కవచంలో చిన్నదుర్గమ్మ



బళ్లారి: కనకదుర్గమ్మకు స్వర్ణాలంకారం



గంగావతి: దుర్గమ్మ అంబారీ ఊరేగింపు



చెళ్లకెర పట్టణంలో ఏనుగుపై వాసవీ మాత విగ్రహం ఊరేగింపు



సిరుగుప్ప దేవినగర్ క్యాంపులో దుర్గాదేవిగా అమ్మవారు



కారటగి: దేవిక్యాంపు రత్నగిరిపై శ్రీదేవి



శ్రీరామనగర్: దుర్గాదేవి పల్లకీని మోస్తున్న ఎంపీ రాజశేఖర

# దేవి వైభవం...భక్త సంభ్రమం

## ముగిసిన శరన్నవ రాత్రి ఉత్సవాలు



హొసపేటె: కొల్లమ్మ ఆలయం వద్ద అగ్నిగుండం తొక్కుతున్న భక్తులు

**బళ్లారి, బళ్లారి గ్రామీణ, న్యూస్‌టుడే:** బళ్లారి నగరం, గ్రామీణ ప్రాంతాల్లో పది రోజులుగా నిర్వహించిన దసరా ఉత్సవాలు శనివారం ముగిశాయి. చివరి రోజు చాలా ఆలయాల్లో అమ్మవారిని శ్రీరాజరాజేశ్వరిగా అలంకరించి భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు. వాసవీమాతకు సువర్ణ కవచం, చిన్న దుర్గమ్మకు రజత కవచం, పెద్దమ్మకు పుష్పాలు, ఆభరణాలు, బాలాజీ క్యాంపులోని లక్ష్మీబాలాజీ పద్మావతికి పుష్పాలు, రేణుకా యల్లమ్మ, బెంకి మారెమ్మ, మల్నాడు దుర్గమ్మలను విశేషంగా అలంకరించి పూజలు చేశారు. బన్ని మాంకాళమ్మ ఆలయానికి భక్తులు పోటెత్తారు. ఈ సందర్భంగా సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. ఉత్సవ విగ్రహాలను పట్టణ, గ్రామీణ వీధుల్లో ఊరేగించారు. మఠాల్లో దేవి పురాణ ప్రవచనం చేశారు. నగరంలోని కనకదర్గమ్మను బంగారు ఆభరణాలతో అలంకరించి ప్రత్యేక పూజలు చేశారు. శుక్రవారం కనకదుర్గమ్మ దేవస్థానం నుంచి ప్రారంభమైన పల్లకీ ఊరేగింపు మిల్లర్ పేటె, బండిమోట, కౌల్‌బజార్‌లోని గానుగ వీధుల గుండా సాగింది. శనివారం సాయంత్రం కనకదర్గమ్మ ఆలయం చేరుకుంది. పటేల్ నగర్‌లోని సణ్ణ దుర్గమ్మ దేవస్థానంలో విశేష పూజలు నిర్వహించారు. కృష్ణానగర క్యాంపులో ప్రత్యేక పూజలు జరిగాయి. స్థానిక ఎమ్మెల్యే నారా భరత్ రెడ్డి కార్యాలయంలో శుక్రవారం రాత్రి ఆయుధ పూజ చేశారు. బళ్లారి ఐజీపీ లోకేకుమార్, ఎస్పీ శోభారాణి తదితర అధికారులు పూజలో పాల్గొన్నారు.

**హొసపేటె:** హొసపేటె పట్టణంలోని ఏడు కేరి(వాడ)ల్లో ప్రతిష్ఠించిన అమ్మవారిని పల్లకీలో ధర్మదగుడ్డ వరకు ఊరేగించారు. అక్కడ చెన్నబసవణ్ణ, నిజలింగమ్మ అమ్మవార్లకు పూజలు చేశారు. కమలాపుర, బసవనదుర్గ, నాగేనహళ్లి, హొసపేటె నుంచి భక్తులు పల్లకీలతో ధర్మదగుడ్డ వద్దకు చేరుకున్నారు. ప్రత్యేక పూజల తర్వాత పరస్పర శమీ వినియోగం చేసుకున్నారు. మ్యాసకేరి కొల్లమ్మ ఆలయం వద్ద ఏర్పాటు చేసిన అగ్నిగుండాన్ని తొక్కిన భక్తులు తమ మొక్కుబడులు తీర్చుకున్నారు. పటేల్‌నగర్‌లో దుర్గాపరమేశ్వరి అమ్మవారి పల్లకీ ఉత్సవం ఘనంగా జరిగింది.

**గంగావతి:** గంగావతి తాలూకా ఆనెగుంది మేగోట దుర్గమ్మ అంబారీ ఊరేగింపు కనులపండువగా సాగింది. మేగోట కొండపై అమ్మవారి ఉత్సవమూర్తిని అంబారీపై ప్రతిష్ఠించి ఊరేగించారు. మహంత బ్రహ్మానంద స్వామి ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాలు జరిగాయి. ఈ సందర్భంగా మేళతాళాలు, మంగళ వాయిద్యాలు, మహిళల పూర్ణకుంభాల ఊరేగింపు, జానపద బృందాల ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. రాజవంశస్థులు లలితారాణి శ్రీరంగదేవ రాయలు, శ్రీకృష్ణదేవరాయలు, శాసనసభ మాజీ సభ్యుడు పరణ్ణ మునవళ్లి పాల్గొన్నారు. గంగావతి పట్టణంలోని శంకర మఠంలో ధర్మకర్త నారాయణరావ్ వైద్య ఆధ్వర్యంలో నవ చండీ హోమం నిర్వహించారు.

**చెళ్లకెర:** చెళ్లకెర పట్టణంలో విజయదశమి పర్వదినాన్ని భక్తిశ్రద్ధలతో జరుపుకొన్నారు. శనివారం ఉదయం ఆర్య వైశ్య, వాసవీ మహిళా, యువజన సంఘాల నేతృత్వంలో వాసవీ మాత విగ్రహాన్ని ఏనుగుపై ఊరేగించారు. వందలాది భక్తులు దర్శించుకున్నారు. గ్రామ దేవతలు చెళ్లకెరమ్మ, ఉడసలమ్మ, వీరభద్ర ఉత్సవాలు ఊరేగించారు. ఎమ్మెల్యే రఘుమూర్తి నగరసభ సభ్యులు, ప్రజా ప్రతినిధులు, అధికారులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

**సిరుగుప్ప, న్యూస్‌టుడే:** సిరుగుప్ప తాలూకావ్యాప్తంగ ఉదయం దశమిని వనంగా ఆచరించారు. తెలుగు క్యాంపులో పండగ పురస్కరించుకొని అమ్మవార్లకు నైవేద్యం సమర్పించి పూజలు చేశారు. సాయంత్రం సమీపంలోని అమ్మవారి ఆలయాలకు వెళ్లి వివిధ రూపాల్లో అలంకరించిన అమ్మవార్లను దర్శించుకొని ప్రసాదాలు తీర్థప్రసాదాలు స్వీకరించారు.

**దేవిక్యాంపు (కారటగి), న్యూస్‌టుడే:** దేవిక్యాంపు రత్నగిరిపై దసరా ఉత్సవాలు ఆదివారం అన్న సంతర్పణతో ముగిశాయి. శ్రీదేవి అమ్మవారిని రాజరాజేశ్వరీదేవిగా అలంకరించి భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు. పూజలనంతరం అమ్మవారి విగ్రహాన్ని క్యాంపులో ఊరేగించారు. ప్రజా సహకారంతో కొల్లా శుభరాణి నాగిరెడ్డి సేవా ట్రస్టు ఉత్సవాలు నిర్వహించింది.



హొసపేటె: శక్తి దేవతల పల్లకీలు

**శ్రీరామనగర్:** శ్రీరామనగర్‌లోని కనకదుర్గాదేవి ఆలయంలో దసరా ఉత్సవాలు పది రోజులు సంబరంగా జరిగాయి. దశమి నాడు అమ్మవారు రాజరాజేశ్వరీదేవిగా దర్శనమిచ్చారు. మధ్యాహ్నం అన్న సంతర్పణ జరిగింది. సాయంత్రం మేళతాళాలతో అమ్మవారి ఉత్సవ విగ్రహాన్ని సింధనూరు మార్గంలోని జమ్మి చెట్టు వద్దకు ఊరేగించారు. అక్షింత పూజలు చేసి తిరిగి ఆలయానికి చేరుకున్నారు. ఎంపీ రాజశేఖర్ హిట్నాళ్, వెంకటేశ్ తంగడగి, స్థానిక ప్రజాప్రతినిధులు, ఆలయ సమితి సభ్యులు, గ్రామ పెద్దలు, రైతులు, మహిళలు, యువకులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

**సింధనూరు, న్యూస్‌టుడే:** సింధనూరు దసరా ఆడంబరంగా జరిగింది. చివరిరోజు జంబూ సవారీతో ముగిసింది. అంబారీపై బగాలుమఖి శ్రీక్షేత్ర సిద్ధపర్వత అంబాదేవి ఉత్సవ విగ్రహాన్ని కూర్చోబెట్టి పురవీధుల్లో ఊరేగించారు. స్థానిక గాంధీ కూడలిలో జంబూసవారీ వేడుక నిర్వహించారు. మూడో మైలు క్యాంపు రంభాపురి శాఖామఠం సోమనాథ శివాచార్యులు, ఎమ్మెల్యే బాదర్లి, మాజీ ఎమ్మెల్యే కేవీ పులామలాలు ఐల్ అంబారీకి స్వాగతం పలికి ఊరేగింపును ప్రారంభించారు. ప్రయాణ ప్రాంగణం, బసవ వృత్తం, పాతబజార్, కిత్తూరు రాణి చెన్నమ్మ, కనక కూడళ్ల మీదుగా ఆర్జీఎం మైదానం చేరుకుంది. మధ్యలో కొప్పళ ఎంపీ రాజశేఖర్ హిట్నాళ్, మాజీ మంత్రి నాడగౌడ వచ్చి చేరారు. గాంధీనగర్‌లో శివాలయం వద్ద 3వ గంగా పూజతో మొదలైన వేడుకలు 12వ తేదీ వరకు సాగాయి.



గంగావతి శంకరమఠంలో నవచండీ హోమం

### యర్రంగలిలో కార్ణికోత్సవం

**బళ్లారి, న్యూస్‌టుడే:** కురుగోడు తాలూకా యర్రంగలి గ్రామంలో దసరా పండగ సందర్భంగా మైలార లింగేశ్వర దేవస్థానంలో కార్ణికోత్సవం అత్యంత భక్తిశ్రద్ధలతో జరిగింది. నవీన్ బడిగేర్ కార్ణికోత్సవంలో పాల్గొని భవిష్యవాణి వినిపించారు. బడిగేర్ భవిష్యవాణి చదివే సమయంలో నిశ్శబ్దం అలముకొంది. మంచి వర్షాలతో పంటలు బాగా పండి అధిక దిగుబడి వస్తుందని చెప్పిన నవీన్ బడిగేర్ ఎత్తయిన కర్ర పైనుంచి కిందకు పడ్డారు. భక్తులు పట్టుకున్నారు. నవీన్ బడిగేర్ ఏడు రోజులు ఉపవాస దీక్షలో ఉండి, చివరి రోజు దసరాకు మైలార లింగేశ్వర కార్ణికోత్సవానికి నేరుగా వచ్చారు. భవిష్యవాణి వినడానికి వివిధ ప్రాంతాల నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. ముందుజాగ్రత్తగా కురుగోడు పోలీసులు గట్టి బందోబస్తు ఏర్పాటు చేశారు.



ఎత్తయిన కర్రపై నవీన్ బడిగేర్ చదువుతున్న భవిష్యవాణిని వినడానికి వచ్చిన మఠాధిశులు, భక్తులు



బళ్లారి గ్రామీణ: బన్ని మాంకాళమ్మకు భక్తుల పూజ



బళ్లారి: సిద్ధేశ్వర తాత మఠంలో దేవి ఊరేగింపు



బళ్లారి: అమ్మవారి దర్శనానికి తరలివచ్చిన భక్తులు



బళ్లారి: అన్నదానం చేస్తున్న ఎమ్మెల్యే నారా భరత్‌రెడ్డి



సింధనూరు: అంబారీపై అమ్మవారి ఉత్సవ విగ్రహం ఊరేగింపు



సింధనూరు: ఊరేగింపులో పాల్గొన్న ఎంపీ, ఎమ్మెల్యే తదితరులు

## మద్వాచార్యుల జయంతి



మద్వాచార్యుల చిత్రపటంతో బ్రాహ్మణ సమాజం ర్యాలీ

**బళ్లారి గ్రామీణ, న్యూస్‌టుడే:** మద్వాచార్యుల జయంతి సందర్భంగా బళ్లారి బ్రాహ్మణ సమాజం ఆయన చిత్రపటానికి ప్రత్యేక పూజలు చేశారు. వేంకటేశ్వరస్వామి దేవస్థానం నుంచి సంగం, గడగి చన్నప్ప కూడళ్లు, బెంగళూరు రోడ్డు మీదుగా తేరు వీధిలోని రాఘవేంద్ర మఠం వరకు కీర్తనలు ఆలపిస్తూ ర్యాలీ చేశారు. చివరగా రాఘవేంద్ర కూడలిలోని వేంకటేశ్వర ఆలయం వద్ద భక్తులకు ప్రసాద వితరణ చేశారు. కార్యక్రమంలో బళ్లారి బ్రాహ్మణ సమాజ బాంధవులు ప్రకాష్‌రావు, రాఘవేంద్రరావు, గిరిష్‌కుమార్, నేమకల్లురావు, నాగరాజు, రవీంద్ర, హరి, దేశాయ్ తదితరులు పాల్గొన్నారు.

## నవ్వులు పూయించిన హాస్యనాటిక



నాటికలో ఓ సన్నివేశం

**బళ్లారి గ్రామీణ, న్యూస్‌టుడే:** బళ్లారి నగరంలోని పటేల్‌నగర్ చిన్న దుర్గమ్మ ఆలయ ఆవరణలో ఏర్పాటు చేసిన సాంస్కృతిక కార్యక్రమాల్లో తుంగగంగా సాంస్కృతిక కళాట్రస్ట్ కళాకారులు ప్రదర్శించిన 'యారిగె బేకు నన్నకవితె' అనే హాస్యనాటిక ప్రేక్షకులను కడుపుబ్బా నవ్వించింది. కళాకారులు తమ అభినయంతో ప్రేక్షకులను నవ్వుల్లో ముంచెత్తారు. హాస్యంతో సమాజానికి చక్కటి సందేశాన్ని ఇచ్చారని ఆలయ అధ్యక్షుడు మీనళ్లి తాయణ్ణ పేర్కొన్నారు. ఇలాంటి సందేశాత్మక నాటికలు మరిన్ని అవసరమన్నారు. అనంతరం కళాకారులను జ్ఞాపికలు, శాలువాలతో సత్కరించారు. విద్యానగర్ గంగా పరమేశ్వరీ ఆలయంలో కోలాట కళాకారులను అభినందించారు. ఆలయ కమిటీ సభ్యులు ఎర్రిస్వామి, రమేష్, రాధమ్మ, విజయకుమార్, సునీల్, కిట్టు, సంతోష్ స్వామి, మౌలాలి తదితరులు పాల్గొన్నారు.

### తుంగభద్ర జలాశయం నీటిమట్టం

పూర్తిస్థాయి నీటిమట్టం 1633 అడుగులు

| 13-10-2024 (ఉ॥ 8 గంటలకు) | ప్రస్తుతం | గత సంవత్సరం |
|---|---|---|
| నీటిమట్టం (అడుగుల్లో) | 1631.97 | 1614.75 |
| ఇన్‌ఫ్లో (క్యూసెక్కుల్లో) | 84,504 | 360 |
| అవుట్‌ఫ్లో (క్యూసెక్కుల్లో) | 82,968 | 9,254 |
| నీటి నిల్వ (టి.ఎం.సి) | 101.656 | 47.828 |

గరిష్ఠసామర్థ్యం (133 టీఎంసీలు) వాస్తవసామర్థ్యం 105.788 టీఎంసీలు

## మహిళలు అన్ని రంగాల్లో రాణించాలి



మాట్లాడుతున్న బసవలింగ మహాస్వామి, చిత్రంలో ఎమ్మెల్యే గణేష్, వివిధ మఠాధీశులు

**బళ్లారి, న్యూస్‌టుడే:** సమాజంలో పురుషులకు దీటుగా మహిళలు అన్ని రంగాల్లో రాణించినప్పుడే దేశం అభివృద్ధి పథంలో దూసుకుపోతుందని కొట్టూరు సంస్థాన మఠం పీఠాధిపతి బసవలింగ మహాస్వామి అన్నారు. కురుగోడు పట్టణంలోని కొట్టూరు మఠంలో ఆదివారం ఏర్పాటు చేసిన దేవిపురాణం, 1001 మంది మహిళలకు ఒడి నింపే కార్యక్రమాన్ని స్వామి ప్రారంభించి మాట్లడారు. మన సంస్కృతి, సంప్రదాయాలను కాపాడాలని, స్త్రీలకు తగు గౌరవం ఇవ్వాలన్నారు. దేవిపురాణంలో మహిళల పాత్ర గురించి వివరించారు. మఠంలో అన్నదానం, అక్షరాభ్యాసం కల్పనకు ప్రాధాన్యం ఇస్తున్నట్లు వివరించారు. మఠం పీఠాధిపతి నిరంజన ప్రభుస్వామి దేవిపురాణం ప్రాముఖ్యత, సమాజంలో మహిళ పాత్ర గురించి వివరించారు. ఎమ్మెల్యే గణేష్ మాట్లాడుతూ బాల్య వివాహాలు ఆపాలని, ఆడ పిల్లలను బాగా చదివించాల్సిన బాధ్యత తల్లిదండ్రులపై ఉందన్నారు. కార్యక్రమంలో శ్రీధరగడ్డ మరికొట్టూరు దేశీయస్వామి, పురసభ అధ్యక్షుడు శేఖణ్ణ, ఉపాధ్యక్షుడు మల్లికార్జున, అఖిలభారత వీరశైవ మహాసభ తాలూకా అధ్యక్షులు అర్వి శరణబసవ, సదాశివయ్య, మల్లేశప్ప సిందగి గవిసిద్ధప్ప, ఆనంద చానాళు అంబరేశ, యర్రిస్వామి తదితరులు పాల్గొన్నారు.

## భక్తిశ్రద్ధలతో రథోత్సవాలు

**కంప్లి, న్యూస్‌టుడే:** కంప్లి తాలూకా సమీపంలోని మణ్ణూరు-సూగూరులో గురుపాదేశ్వర తాత రథోత్సవం శనివారం సాయంత్రం భక్తిశ్రద్ధలతో జరిగింది. భక్తుల జయజయ ధ్వనుల మధ్య మఠం నుంచి ప్రారంభమైన రథోత్సవం పాదగట్టె వరకు వెళ్లి తిరిగి యథాస్థానానికి చేరుకుంది. ప్రజలు పూలు, పండ్లు సమర్పించారు. ఉదయం నుంచి వివిధ పూజా కార్యక్రమాలు జరిగాయి. తొమ్మిది రోజులుగా జరుగుతున్న పురాణ ప్రవచనం ముగిసింది.

**సిరుగుప్ప, న్యూస్‌టుడే:** తాలూకాలోని మిట్టేసూగురు గ్రామంలో మారికాంబ రథోత్సవం వైభవంగా జరిగింది. దసరా సందర్భంగా గ్రామంలోని అమ్మవారి ఆలయంలో ఉదయం ప్రత్యేక పూజలు చేశారు. సాయంత్రం రథోత్సవం నిర్వహించారు. మహిళలు రథాన్ని లాగడం ఇక్కడి ప్రత్యేకత.



కంప్లి: మణ్ణూరు-సూగూరులో రథయాత్ర

## జడ్పీ మాజీ సభ్యురాలి మృతికి సంతాపం

**శ్రీరామనగర్, న్యూస్‌టుడే:** జిల్లా పంచాయతీ మాజీ సభ్యురాలు మల్లిన విజయలక్ష్మి నరసింహమూర్తి (66) ఆదివారం ఉదయం అనారోగ్యంతో కన్నుమూశారు. ఆమెకు భర్త, కుమారుడు, కుమార్తె ఉన్నారు. విజయలక్ష్మి మృతి పట్ల స్థానిక ప్రజాప్రతినిధులు, నాయకులు, రైతులు తీవ్ర సంతాపం వ్యక్తం చేశారు.



మల్లిన విజయలక్ష్మి

## ట్రాక్టర్ పల్టీ: పలువురికి గాయాలు

**కారటగి, న్యూస్‌టుడే:** కారటగి దేవి క్యాంపు వద్ద ట్రాక్టర్ బోల్తాపడటంతో పలువురు గాయపడిన ఘటన శనివారం మధ్యాహ్నం జరిగింది. సింధనూరు తాలూకా జంబునాథనహళ్లి గ్రామానికి చెందిన పిల్లలతో పాటు 30 మందికి పైగా దసరా సందర్భంగా ట్రాక్టర్‌లో శనివారం దేవిక్యాంపు శ్రీదేవి బీరేశ్వర దర్శనానికి వచ్చారు. దర్శనం ముగించుకుని ట్రాక్టర్‌లో కొండ దిగుతుండగా ట్రాలీ అదుపుతప్పి బోల్తాపడింది. స్పందించిన స్థానికులు క్షతగాత్రులను అంబులెన్సు, ఇతర వాహనాల్లో చికిత్స నిమిత్తం కారటగి ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఇద్దరు మహిళలకు తీవ్ర గాయాలవడంతో మెరుగైన వైద్యం కోసం గంగావతి ఆసుపత్రికి పంపించారు. స్వల్పంగా గాయపడిన పిల్లలు, పెద్దలు స్థానిక అసుపత్రిలో చికిత్స పొందారు.

## డిజిటల్ రసీదు పద్ధతికి చర్యలు

**హొసపేటె, న్యూస్‌టుడే:** జిల్లాలోని అన్ని దేవాదాయ, ధర్మాదాయ శాఖ ఆలయాల్లో సేవలకు సంబంధించి డిజిటల్ చెల్లింపునకు చర్యలు తీసుకున్నట్లు జిల్లా పాలనాధికారి ఎం.ఎస్. దివాకర్ పేర్కొన్నారు. ఆదివారం ఆయన హరపనహళ్లి తాలూకా ఉచ్చంగిదుర్గ, ఇతర ఆలయాల్లో ఈ పద్ధతిని పరిశీలించి మాట్లాడారు. డిజిటల్ రసీదు విధానం జారీలోకి వచ్చిన నాటి నుంచి అన్ని ఆలయాల ఆదాయం బాగా పెరిగిందని వివరించారు. చిన్న సేవలకూ భక్తులు చెల్లించిన మొత్తాలకు డిజిటల్ రసీదులే ఇవ్వాలని ఆయన సూచించారు. ఈ సందర్భంగా కొండపైనున్న ఉచ్చంగి దుర్గ, హాలమ్మ ఆలయాల్లో మౌలిక సదుపాయాలపై ఆరా తీశారు. ఆలయాలకు వచ్చే భక్తుల సంఖ్య పెరుగుతున్న నేపథ్యంలో తాగు నీరు, శౌచాలయాలు, రహదారుల నిర్మాణానికి చర్యలు తీసుకుంటామని తెలిపారు.



డిజిటల్ రసీదు చెల్లింపును పరిశీలిస్తున్న కలెక్టర్ దివాకర్

# వీరమదకరి సాహసం చిరస్మరణీయం



హొసపేటె: వీరమదకరి ప్రతిమ వద్ద ఎమ్మెల్యే గవియప్ప, వాల్మీకి ప్రముఖులు

**హొసపేటె, న్యూస్‌టుడే:** చిత్రదుర్గను పరిపాలించిన రాజు వీరమదకరి నాయక పాలన వాల్మీకి సముదాయానికి గర్వకారణమని స్థానిక శాసనసభ్యుడు హెచ్.ఆర్. గవియప్ప అన్నారు. వాల్మీకి నాయక తాలూకా సంఘం ఆధ్వర్యంలో ఆదివారం ఇక్కడ ఏర్పాటు చేసిన వీరమదకరి నాయక జయంతిలో ఆయన పాల్గొని మాట్లాడారు. చిత్రదుర్గ కోటలో నేటికీ వీరమదకరి నాయక వీరత్వంపై కథలు వెల్లువెత్తుతాయని గుర్తుచేశారు. జనాభా పరంగా హొసపేటెలో పెద్ద సంఖ్యలో ఉన్న వాల్మీకి నాయక సముదాయ ప్రజలు పట్టణాభివృద్ధికి, ప్రభుత్వానికి సహకారం అందివ్వాలని కోరారు. ప్రముఖులు చంద్రశేఖర్, కటిగి జంబయ్య, కణ్ణి శ్రీకంఠం, కిచిడి శ్రీనివాస్ తదితరులు పాల్గొని నివాళులర్పించారు.

**సిరుగుప్ప, న్యూస్‌టుడే:** వీరమదకరి నాయక్ జయంతిని వాల్మీకి భవనంలో ఆచరించారు. వాల్మీకి సమాజం తాలూకా అధ్యక్షుడు టి.నరసింహనాయక్, మాజీ నగరసభ అధ్యక్షుడు బి.ఎం.సతీష్ తదితరులు మాట్లాడుతూ విజయనగర రాజుల కాలంలో మదకరి తన ధైర్య, సాహసాలతో అనేకమంది శత్రువులతో పోరాడి విజయుడిగా నిలిచారని గుర్తు చేశారు. అలాంటి మహనీయుల జయంతులను ఆచరించడం సమాజానికి ఉత్తమ మార్గదర్శనం చేసినట్లవుతుందన్నారు. విశ్రాంత ప్రిన్సిపల్ విరేశప్ప, విరుపాక్షప్ప, యల్లప్ప, భీమలింగప్ప, గాదిలింగప్ప, సముదాయ సభ్యులు పాల్గొన్నారు.



సిరుగుప్ప: నాయక్ చిత్రపటానికి సమాజం ప్రతినిధులు, సభ్యుల నివాళి

# అంబారీపై సిద్ధు సవారీ



అంబారీ బస్సుపై సిద్ధరామయ్యతో డాక్టర్ ఎంసీ సుధాకర్, కేజే జార్జ్, పుష్పా అమరనాథ్, లక్ష్మీ హెబ్బాళ్కర్



ముఖ్యమంత్రికి స్వాగతం పలికేందుకు వేచి ఉన్న పర్యాటకులు, ప్రజలు

**మైసూరు, న్యూస్‌టుడే:** పర్యాటక శాఖ అందుబాటులోకి తీసుకువచ్చిన అంబారీ బస్సు పైకప్పుపై ఏర్పాటు చేసిన ఆసనాల్లో కూర్చుని ముఖ్యమంత్రి సిద్ధరామయ్య రాచనగరిలో పర్యటించారు. డాక్టర్ ఎంసీ సుధాకర్, కేజే జార్జ్, పుష్పా అమరనాథ్, లక్ష్మీ హెబ్బాళ్కర్ తదితరులతో కలిసి దసరా పండగ సందడిని ఆస్వాదించారు. ప్యాలెస్ సమీపానికి బస్సు చేరుకున్నప్పుడు ఒక వ్యక్తి 'లవ్ యూ సీఎం' అంటూ వేసిన కేకకు సిద్ధరామయ్య ముసిముసిగా నవ్వుకోగా, పక్కనే ఉన్న మంత్రులు, నేతలు ఆశ్చర్యపోయారు. విఖ్యాత దసరా వేడుకలకు ప్రభుత్వం చేసిన ఏర్పాట్లపై పర్యాటకులు సంతృప్తి వ్యక్తం చేశారు. నగరంలో 130 కి.మీ. రహదారుల్లో విద్యుత్తు దీపాలతో అలంకరణలు చేశారు. వీటిని ఈ నెల 22 వరకు కొనసాగించనున్నారు. దసరా వేడుకలు ముగిసినా, మైసూరులో పర్యాటకుల రద్దీ, కొనుగోళ్లు, కొనసాగుతూనే ఉన్నాయి.



అదరహో.. కర్ణాటక పాల సమాఖ్య శకటం

## కన్నడ ప్రాభవం చాటిన స్తబ్ధ చిత్రం

**మైసూరు, న్యూస్‌టుడే:** మైసూరు దసరా ఉత్సవాల్లో భాగంగా నిర్వహించే జంబూ సవారీలో 31 జిల్లాల నుంచి 51 స్తబ్ధ చిత్రాలను ప్రదర్శించారు. ఆయా జిల్లాల ప్రాముఖ్యతతో పాటు కర్ణాటక వైభవాన్ని, ప్రాముఖ్యతను తెలిపే స్తబ్ధ చిత్రాలకు సందర్శకుల నుంచి చక్కని స్పందన లభించింది. ఒక్కో శకటం, ఒక్కో ప్రత్యేకతను చాటి చెబుతుందన్నారు. భారతీయ రైల్వే, కేంద్ర ఆహార సాంకేతిక పరిశోధన సంస్థ శకటాలతో పాటు, మైసూరు పట్టు చీరలను తయారు చేయించి విక్రయించే మైసూరు పట్టు, మైసూరు చందనపు సబ్బు, అగరబత్తీలు, శిల్పకళ, కిన్నాళె కళ, ఇటగి దేవాలయం, చెన్నబసవ పట్ట దేవరు, సూలిగర సొగడమ్మ, కొడగు భూసం రక్షణ, కోలారు కోటిలింగేశ్వర, హారంగి జలాశయ, ఏను గుల శిబిరం, బుద్ధ, బసవ, అంబేడ్కర్ విగ్రహాలు, మురుడేశ్వర దేవాలయం తదితర స్తబ్ధ చిత్రాల శకటాలు వచ్చినప్పుడు ఆ ప్రాంతాలకు చెందిన పర్యాటకుల నుంచి ఘన స్వాగతం లభించింది. ప్యాలెస్ నుంచి బన్ని మండపం వరకు శకటాలను నడిపారు. ఆయా శకటాలను రూపొందించిన కళాకారులకు త్వరలో బహుమతులు వితరణ చేస్తామని అధికారి కేవీ ప్రభుస్వామి తెలిపారు



కొడగు జిల్లా ప్రత్యేకతలను తెలిపే నమూనా



శకటంలో చామరాజనగర జిల్లా విశేషాల మాలిక

## మేలుకోటెలో భక్తుల రద్దీ



చెలువ నారాయణ స్వామి (చెల్వ తిరునారాయణ స్వామి)

**మండ్య, న్యూస్‌టుడే:** మైసూరు యదువంశానికి కులదైవమైన మేలుకోటె చెలువ నారాయణ స్వామిని విజయదశమి రోజు పాతికవేలకుపైగా భక్తులు దర్శించుకున్నారు. ఆదివారం కూడా రద్దీ కొనసాగింది. చెల్వతిరునారాయణ స్వామి, కొండపై యోగ నరసింహ స్వామికి పండగ కోసం ప్రత్యేక అలంకరణ చేశారు. చెలువ నారాయణ స్వామికి శంఖం, చక్రం, గద, పద్మం, కత్తి, విల్లు బాణం, మైసూరు తలపాగా, జలతారు పట్టు పంచెలతో అలంకరించారు. పోలీసు శాఖ, గ్రామ పంచాయతీ సిబ్బంది భక్తులకు కావలసిన సదుపాయాలు కల్పించలేదని కొందరు పర్యాటకులు ఆరోపించారు. ప్రభుత్వం నుంచి ఆర్థిక సహకారం లేకపోవడంతో ఈ ఏడాది దీపాలంకరణ, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించలేకపోయామని ఆలయ పాలక మండలి ప్రతినిధులు ఆవేదన వ్యక్తం చేశారు.

## ప్రసన్న చౌడేశ్వరికి భక్తనీరాజనం



ప్రసన్న చౌడేశ్వరి అమ్మవారు

**కోలారు, న్యూస్‌టుడే:** ముళబాగిలు సమీపంలోని మండికల్‌లో ప్రసన్న చౌడేశ్వరి అమ్మవారిని పెద్ద సంఖ్యలో భక్తులు దర్శించుకున్నారు. శుక్రవారం నుంచి ఆదివారం వరకు ఆలయంలో రద్దీ కొనసాగింది. భక్తుల కోసం తీర్థ ప్రసాదాలను వితరణ చేయగా, కొందరు భక్తులు తాము తయారు చేసుకు వచ్చిన ప్రసాదాలను ఇతరులకు పంచిపెట్టారు.

## త్రిభాషా నిఘంటువు ఆవిష్కరణ

**బెంగళూరు (మల్లేశ్వరం), న్యూస్‌టుడే:** ఆక్స్‌ఫర్డ్ యూనివర్సిటీ ప్రెస్ తన 13వ భారతీయ భాషా నిఘంటువును ఇక్కడ విడుదల చేసింది. ఉత్తర ప్రదేశ్ సంస్కృత సంస్థాన్ సహకారంతో సంస్కృతం-హిందీ-ఆంగ్ల నిఘంటువును అందుబాటులోకి తీసుకువచ్చామని ఆక్స్‌ఫర్డ్ యూనివర్సిటీ ప్రెస్ భారతీయ విభాగం నిర్వాహక సంచాలకుడు సుమంతా దత్త తెలిపారు. ఇక్కడ నిర్వహించిన సమావేశంలో విలేకరులతో మాట్లాడుతూ, పాతికవేల సంస్కృత పదాలకు హిందీ, ఆంగ్లం ద్వారా నేర్చుకునేందుకు ఈ నిఘంటువు సహకరిస్తుందని తెలిపారు. కేంద్రం ఇప్పటికే సంస్కృతానికి ప్రాచీన హోదా ఇచ్చిన విషయాన్ని గుర్తు చేశారు. సంస్కృతాన్ని నేర్చుకోవడం ద్వారా దేశీయ, విదేశీ భాషలను కూడా తేలికగా అర్థం చేసుకునేందుకు అవకాశం ఉంటుందని ఆయన వివరించారు.

## రెక్కవిప్పిన సృజన.. డ్రోన్ల అద్భుత ప్రదర్శన




సింహ వాహనంపై దుర్గామాత




అంబారీ ఏనుగు

**మైసూరు, న్యూస్‌టుడే:** విఖ్యాత దసరా ఉత్సవాల్లో భాగంగా పర్యాటకులు, సందర్శకుల కోసం నిర్వహించిన డ్రోన్ల ప్రదర్శనకు చక్కని స్పందన లభించింది. నాలుగు రోజుల పాటు 1500 డ్రోన్లతో నిర్వహించిన ప్రదర్శనలో కర్ణాటక ప్రాధాన్యత, చాముండేశ్వరి ఉత్సవాలు, విఖ్యాత దసరా వేడుకలు, అంతరిక్షంలో భారత్ సాధించిన విజయాలు, కర్ణాటకలోని వివిధ సంస్థల ప్రతినిధులు జాతీయంగా, అంతర్జాతీయంగా సాధించిన విజయాలను కళ్లకు కట్టేలా డ్రోన్లు దీపాలు వెలిగించి, చిత్రాలను రూపొందించాయి. ఈ ప్రదర్శనకు అనుబంధంగా లేజర్ లైట్లతో ఇచ్చిన ప్రదర్శనలను ప్రేక్షకులు వీక్షిస్తూ చప్పట్లు కొట్టి, కేకలు వేస్తూ ఆస్వాదించారు. ఒక్కో ప్రదర్శన గంటకు పైగా కొనసాగింది. పర్యాటకులు, ఇతర జిల్లాల నుంచి వచ్చిన ప్రజలు అందరికీ ఈ ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి.



రెక్కలు విచ్చుకుని ఎగురుతున్న గద్ద



చంద్రునిపై జాతీయ పతాకం, ఉపగ్రహం

## భళా..బాగవ్వ!



కుమారునికి తాళం చెవి నమూనా అందిస్తున్న బాగవ్వ

**బెళగావి, న్యూస్‌టుడే:** భాగ్యలక్ష్మి పథకంలో ప్రభుత్వం ప్రతి నెలా ఇస్తున్న రూ.2 వేల నగదు, ఇప్పటి వరకు తాను కూడబెట్టుకున్న నగదుతో కలిసి బాగవ్వ నీలప్ప సజ్జిక్కి అనే మహిళ తన కుమారుడు రమేశ్‌కు బైకు కొనిచ్చారు. గోకాక్ తాలూకా కౌజలగి గ్రామానికి చెందిన ఆమె తన కోడలు లక్ష్మిని, కుమారుడ్ని తీసుకుని షోరూమ్‌కు వచ్చి బైకు కొనుగోలు చేసుకున్నారు. ఈ బైకు రూ.1.18 లక్షలు కాగా, తల్లి రూ.20 వేలు, భార్య రూ.20 వేలు ఇచ్చారని, మిగిలిన మొత్తాన్ని తాను సమకూర్చుకున్నానని రమేశ్ తెలిపారు.

## శెభాష్..మాళవీ !



గ్రంథాలయం లోపల పుస్తకాలను సమకూర్చిన గ్రామ పంచాయతీ సభ్యురాలు మాళవి బొమ్మప్పమెట్రి

**బెంగళూరు(యశ్వంతపుర),న్యూస్‌టుడే:** రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ఐదు గ్యారంటీ పథకాల్లో ఒకటైన గృహలక్ష్మీ పథకం ద్వారా లబ్ధిపొందిన ఓ మహిళ తన స్వగ్రామంలో పోటీ పరీక్షలకు హాజరవుతున్న విద్యార్థుల కోసం పోటీ గ్రంథాలయాన్ని ఏర్పాటు చేసి ఇతరులకు ఆదర్శంగా నిలిచారు. బెళగావి జిల్లా రాయబాగ తాలూకా మంటూరు గ్రామ పంచాయతీ సభ్యురాలు మాళవి బొమ్మప్పమెట్రి గృహలక్ష్మీ పథకం ద్వారా ఏడాది పాటు పొందిన రూ.24 వేలను సొంత అవసరాలకు ఖర్చు చేయలేదు. గ్రామంలో వివిధ పోటీపరీక్షలకు సిద్ధమవుతున్న విద్యార్థులు చాలామంది ఉన్నారు. పుస్తకాల కోసం సమీపంలో ఉన్న రాయబాగ పట్టణం లేకపోతే బెళగావి నగరానికి వెళ్తున్నారు. కొందరు ముంబయి, బెంగళూరు నగరాల్లోకి వెళ్లి పోటీ పరీక్షలకు సిద్ధపడుతున్నారు. నెలకొన్న సమస్యను గ్రహించిన ఆమె గృహలక్ష్మీ పథకం ద్వారా వచ్చిన నగదుతో చిన్న గది నిర్మించి అందులో పోటీ పుస్తకాలు కొనుగోలు చేసి ఉంచారు. గృహలక్ష్మీ పథకం నగదుతో పాటు కొంత తన సొంతడబ్బులు ఖర్చు చేశారు. విద్యార్థులు పడుతున్న ఇబ్బందులను గమనించి పరిష్కరించేందుకు ఆ పథకం ద్వారా వచ్చిన నగదును గ్రంథాలయం కోసం వ్యయం చేసినట్లు ఆమె తెలియజేశారు.



బనశంకరి అమ్మవారికి పగడాల అలంకారం



పసన్న పార్వతికి గాజుల అలంకరణ



ప్రశాంత చిత్తంతో అంబా భవాని

## పరాశక్తి.. పాహిమాం

**బెంగళూరు (సాంస్కృతికం), న్యూస్‌టుడే:** త్రిమూర్తులతోపాటు దేవ, గంధర్వ, కిన్నెర కింపురుషాదులు నరులు, తదితరులు వేనోళ్ల అమ్మవారిని స్తుతించారు. కారణం నవరూపాలు ధరించి లోక కంటకులైన తొమ్మిది మంది మహా అసురులను నిగ్రహించి లోకంలోనే కాదు సృష్టిలోనే శాంతిని నెలకొల్పిన ఆ మహాశక్తి ఆది శక్తి దుర్గామ్మవారు రౌద్రంతో ఊగిపోతుంటే త్రిమూర్తులు సైతం అమ్మవారిని స్తుతిస్తూ, మంగళహారతులిస్తూ చల్లని జలాలతో పంచామృతాలతో అభిషేకిస్తూ శాంతింపజేశారు. నిదానంగా మాత శాంతించింది. లోకం ఆ శాంతి స్వరూపిణిని చూసి విజయదశమి పండగ ఘనంగా ఆచరించింది. యుద్ధంలో అస్తవ్యస్తంగా ఉన్న మాతకు మంగళద్రవ్యాలతో స్నానాదులు చేయించి, సుందర ఆభరణాలను సైతం అలంకరించి వేదమంత్రాలను రుషులు, రుత్విక్కులు, పండితులు పఠించి ఆమెను సంతోషపరిచారు. లోకం ఊపిరి పీల్చుకుంది. నగరంలోని దేవస్థానాలలో మాతలకు శాంతియుత సుందర అలంకారాలతో శక్తిమాతలు భక్తులకు దర్శనాలను అనుగ్రహించారు. భారీ ఎత్తున శనివారం దేవాలయాల్లో ఊరేగింపులు, జమ్మి ఉత్సవాలు అసంఖ్యాక భక్తుల మధ్య జరిగాయి. టపాసులు పేలాయి.. సంబరాలు మిన్నుముట్టాయి. సుమంగళులు పరస్పరం వాయనాలు సమర్పించుకుని పారాయణాలు చేశారు. బనశంకరి అమ్మవారు పగడాల అలంకారంలో మరింత మెరిసిపోగా మహాంకాళిదేవి వజ్రాభరణాలలో తనకు సాటి లేదనిపించారు. ప్రసన్న పార్వతీదేవి గాజులను అలంకరించుకోగా మంగళాదేవి, అంబాభవాని కాతలు పట్టువస్త్రాలను ధరించి ప్రశాంతచిత్తులై వరాలు కురిపించారు. గవిగంగాధర ఆలయంలో దుర్గాపరమేశ్వరి శాంతం వహించి చిరునవ్వులతో భక్తులకు దర్శన భాగ్యం ప్రసాదించారు.

## పులి నృత్యం.. సంభ్రమాశ్చర్యం



వేదికపై నటులు నవీన్ శంకర్, డాలీ ధనుంజయ, యశ్ శెట్టి తదితరులు

**మంగళూరు, న్యూస్‌టుడే:** నవరాత్రి వేడుకలు వస్తే తీర ప్రాంత జిల్లాల్లో పిలి డ్యాన్స్ (పులి డ్యాన్స్) ప్రదర్శనలు ఉంటాయి. పులి వేషాలు ధరించి ఇచ్చే ప్రదర్శనల ఉత్సవాన్ని 'మార్నెమి'గా వ్యవహరిస్తారు. వీధుల్లో మైదానాల్లో ఆడిటోరియాల్లో పులి వేషధారులు పోటీ పడతారు. ఉత్తమ ప్రదర్శనలకు చక్కని బహుమతులు ఉంటాయి. నవరాత్రి ప్రారంభం రోజున ఒంటికి రంగు వేసుకునే కళాకారులు విజయదశమి పూర్తయ్యే వరకు రంగులు తీయరు. ఇటీవలి కాలంలో పురుషులతో పాటు మహిళలు కూడా ముందుకు వస్తున్నారు. ఒంటికి స్వయంగా రంగు వేసుకోవడం నుంచి ఇతర బృందాలతో కలిసి అడుగు వేయడం, నృత్యం చేసేందుకు ఒక నెలకు పైగా అభ్యాసాన్ని చేస్తుంటారు. గ్రామాలు, పట్టణాల్లో ఇంటింటికీ వెళ్లి కొంత సేపు నృత్యం చేసి, స్థానికులు ఇచ్చే గౌరవ ధనాన్ని, కానుకలను తీసుకువెళ్లే బృందాలు దక్షిణ కన్నడ, ఉడుపి జిల్లాల్లో అనేకం ఉన్నాయి. ఆయా ప్రాంతాల్లో నిర్వహించిన పులి డ్యాన్స్‌లను బాలీవుడ్ నటుడు సంజయ్ దత్, స్యాండల్‌వుడ్ నటులు నవీన్ శంకర్, డాలీ ధనుంజయ, యశ్ శెట్టి, క్రికెటర్ శివం దూబే తదితరులు వీక్షించారు. మంగళూరులో నిర్వహించిన పోటీలను వీక్షించిన శివం దూబే ప్రేక్షకులను ఉద్దేశించి 'ఎంచ ఉల్లర్' (ఎలా ఉన్నారు) అని తుళు భాషలో పలకరించడంతో స్థానికుల నుంచి చక్కని స్పందన లభించింది. ఫ్రెండ్స్ బల్లాల్ బాగ్ బిరువెర్ కుడ్ల సంస్థ ఏర్పాటు చేసిన పులివేషాల పోటీలకు చక్కని స్పందన లభించింది. తమ సంస్థ పదవ ఏడాది నిర్వహించిన పోటీల్లో పాల్గొనేందుకు వివిధ ప్రాంతాల్లో స్థిరపడిన కళాకారులు వచ్చారని సంస్థ వ్యవస్థాపకుడు ఉదయ్ పూజారి తెలిపారు.



పులి డ్యాన్స్ వీక్షిస్తున్న బాలీవుడ్ నటుడు సంజయ్ దత్



పులి నృత్యం చేస్తున్న కళాకారులు

## ముగ్గురు యువకుల దుర్మరణం



హరీష్



మల్లికార్జున



రవి

**బళ్లారి, ఆలూరు గ్రామీణ, హొలహర్వి, న్యూస్‌టుడే:** ఆంధ్రప్రదేశ్‌లోని కర్నూలు జిల్లా దేవరగట్టు బన్ని ఉత్సవాన్ని తిలకించేందుకు వెళుతూ జరిగిన ప్రమాదంలో ముగ్గురు బళ్లారి యువకులు మృతి చెందారు. ఈ ఘటన ఆలూరు మండలం కరడిగుడ్డం గ్రామ సమీపంలో చోటు చేసుకుంది. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. కర్ణాటకలోని బళ్లారి జిల్లా తగ్గినబూదేహళ్లి గ్రామానికి చెందిన హరీష్ (26), రవి (27), మల్లికార్జున (26)లు ద్విచక్ర వాహనంపై హొళగుంద మండలం దేవరగట్టులో జరిగే బన్ని ఉత్సవాన్ని తిలకించేందుకు శనివారం రాత్రి బయలు దేరారు. అర్ధరాత్రి సమయంలో ఆలూరు తాలూరా కరడిగుడ్డ గ్రామ సమీపంలో వారి ద్విచక్ర వాహనం అదుపుతప్పి సమీప కొండను ఢీకొన్నారు. తీవ్రంగా గాయపడిన హరీష్, మల్లికార్జున అక్కడికక్కడే చనిపోయారు. బలమైన దెబ్బలు తగిలిన రవిని చికిత్స నిమిత్తం బళ్లారి బీఎంసీఆర్‌సీలోని ట్రామాకేర్‌కు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందాడు. సమాచారం అందుకున్న ఆలూరు పోలీసులు ఘటనా స్థలికి చేరుకుని హరీష్, మల్లికార్జున మృత దేహాలను పోస్టుమార్టం నిమిత్తం ఆలూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. చేతికి అంది వచ్చిన ముగ్గురు యువకులు రోడ్డు ప్రమాదంలో మృతి చెందడంతో వారి కుటుంబాలు శోకసంద్రంలో మునిగిపోయాయి.







కొత్త శ్రేణి వాహనంతో అనుపమ్ థరేజా

## కర్ణాటక విపణిలోకి నూతన వాహనం

**ఈనాడు, బెంగళూరు:** దేశీయ మార్కెట్‌లో ఇప్పటికే విడుదలైన జావా 42ఎఫ్‌జే ద్విచక్రవాహనం కర్ణాటక విపణిలోనికి ప్రవేశించింది. బెంగళూరులో జావా యెజ్డి మోటార్ సైకిల్స్ సహ వ్యవస్థాపకుడు అనుపమ్ థరేజా సరికొత్త శ్రేణి 350 జావా 42ఎఫ్‌జే వాహనాలను ఆవిష్కరించారు. ఇప్పటికే 42లైఫ్ శ్రేణుల్లో ఆవిష్కరించిన 42, 42 బాబర్ వాహనాలకు తోడుగా తాజాగా 42ఎఫ్‌జే వాహనాలు కొత్తతరం వినియోగదారుల కోసం తయారైనట్లు ఆయన తెలిపారు. విశాలమైన చక్రాలు, బ్రష్డ్ అల్యూమినియం ట్యాంక్ ప్యానెల్, క్లాస్ లీడింగ్ బ్రేకులు, 350 అల్ఫా2 ఇంజిన్, ఎల్ఈడీ లైటింగ్, 6గేర్ల వ్యవస్థలతో తయారైన నియో క్లాసిక్ డిజైన్ వాహనం బెంగళూరు వినియోగదారుల ఆసక్తికి అనుగుణంగా తయారైనట్లు అనుపమ్ థరేజా తెలిపారు. ఇప్పటికే రాష్ట్రంలో 11, బెంగళూరులో 6 విక్రయ కేంద్రాలున్న జావా సంస్థ త్వరలో మరో ఆరు కేంద్రాలను ఏర్పాటు చేస్తుందన్నారు. డ్యూయల్ చానెల్ ఏబీఎస్ అలాయ్‌తో పాటు స్పోక్ పేరిట ఆరు రకాల వాహనాలు రూ.2.02లక్షల నుంచి రూ. 2.23లక్షల ధరల్లో విక్రయిస్తున్నట్లు ఆయన తెలిపారు.

## ఉగ్రావతార టీజర్ విడుదల

**బెంగళూరు(యశ్వంతపుర),న్యూస్‌టుడే:** ప్రముఖ హీరోయిన్ ప్రియాంక ఉపేంద్ర ప్రధాన పాత్ర పోషిస్తున్న మహిళ కథ ప్రధానంగా నిర్మిస్తున్న 'ఉగ్రావతార' చిత్రం టీజర్‌ను ప్రముఖ హీరో ఉపేంద్ర విడుదల చేశారు. మహిళలపై జరుగుతున్న అత్యాచారాలు, దౌర్జన్యాల నియంత్రణకు పోలీసులు చేపట్టిన స్వయం రక్షణ చర్యలు, సురక్ష యాప్ తదితర పని విధానంతో పాటు జరుగుతున్న దౌర్జన్యాల నుంచి మహిళలు ఎలా కాపాడుకోవాలనే అంశాలపై చిత్రాన్ని నిర్మిస్తున్నట్లు దర్శకుడు గురుమూర్తి తెలిపారు. రోబోగణేష్, లత, దర్శన్ సూర్య, లక్ష్మిశెట్టి, చరణ్, లీలా మోహన్, కార్యన్ నటిస్తుండగా కృష్ణబస్రూరు సంగీతాన్ని అందిస్తున్నారు.



ఉగ్రావతార చిత్రం టీజర్ విడుదల కార్యక్రమంలో ప్రముఖ సినీనటులు ఉపేంద్ర, ప్రియాంక ఉపేంద్ర, రోబోగణేష్, లత, దర్శన్ తదితరులు



సింహరూపిణి చిత్ర బృందం

## 17న సింహరూపిణి రాక

శ్రీచక్రఫిలింస్ బ్యానర్‌పై ఈనెల 17న 'సింహరూపిణి' చిత్రం రాష్ట్ర వ్యాప్తంగా విడుదల కానుంది. గ్రామీణులకు కష్టాలు ఎదురైతే గ్రామదేవతలను పూజించడంతో పాటు జాతర్లు నిర్వహిస్తారు. తద్వారా గ్రామాలకు జరుగుతున్న మంచి అంశాల ఆధారంగా చిత్రాన్ని నిర్మించినట్లు దర్శకుడు కిన్నాళ్ రాజ్ తెలిపారు. ఏడు పాటలకు జన్‌కరణ్ సింగ్ గానం అందించారు. యశ్‌శెట్టి, అంకితా గౌడ, దివ్యాఅలూరు, నీవాసం అశ్వత్, హరిశ్‌రాయ్, విజయ్‌చెందూరు, యశస్విని, అరవ్ లోహిత్ తదితరులు నటిస్తున్నారు.

## సంతోష్ సంగీత సిద్ధం

అర్నవ్ విన్యాస్, రాణివరద్ కలిసి నటిస్తున్న 'సంతోష్ సంగీత' చిత్రీకరణ పూర్తి చేసుకుని విడుదలకు సిద్ధంగా ఉంది. ప్రముఖ లహరి కంపెనీ యజమాని లహరి వేలు తదితరులు కలిసి టీజర్‌ను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయనను చిత్రబృందం సత్కరించారు. ప్రేమ, హాస్యంతో కూడిన చిత్రమని హీరో అర్నవ్ విన్యాస్ తెలిపారు. దొడ్డణ్ణ, అవినాశ్, లయకోకిల, కవన, అమిత్, లోకేశ్‌సూర్య తదితరులు నటిస్తున్నారు.



సంతోష్ సంగీత చిత్రం టీజర్ విడుదల సందర్భంగా లహరి వేలుకు సత్కారం



మర్యాద ప్రశ్నె చిత్రంలో రాకేశ్ అడిగ, సునీల్‌రావ్, శైన్ శెట్టి తదితరులు

## నవంబరు 22న 'మర్యాద ప్రశ్నె'

సమాజంలో జరుగుతున్న విభిన్నమైన సంఘటన ఆధారంగా నిర్మిస్తున్న 'మర్యాద ప్రశ్నె' చిత్రం నవంబరు 22న రాష్ట్రవ్యాప్తంగా విడుదల కానుంది. చిత్రం అన్నివర్గాలను ఆకట్టుకుంటుందని దర్శకుడు నాగరాజు సోమయాజి తెలిపారు. రాకేశ్ అడిగ, సునీల్‌రావ్, శైన్‌శెట్టి, తేజు బెళవాడి, పూర్ణచంద్ర మైసూరు, ప్రభుముండ్కర్, రేఖాకుడ్లిడి, నాగేంద్ర, శ్రవణ్ తదితరులు నటిస్తున్నారు.

# బెంగళూరు

•బెంగళూరు •హోసూరు

## బొమ్మల కొలువు మధ్య సంగీత కచేరి



మల్లేశ్వరంలోని లాస్య వర్ధిన్‌ట్రస్టు ఆధ్వర్యంలో జరుగుతున్న దసరా ఉత్సవాల్లో భాగంగా సుందర నృత్య కార్యక్రమాన్ని నిర్వహించింది. విదుషీ రమ్యాసుధీర్ దర్శకత్వంలో గానసుధా సంగీత విద్యాలయం విద్యార్థులు భక్తి, లలితసంగీత జానపద గీతాలను ఆలపించి సభను రక్తి కట్టించారు. టి.ఎస్.రమేష్ (కీబోర్డు), ఎం.మోహన్ (తబలా), సహకారవాద్య అందించి కచేరీని అలరించారు. సంస్థ అధ్యక్షుడు రవిశంకర్ దంపతులు విద్యార్థులకు ప్రమాణపత్రాలు అందజేశారు. ముఖ్య అతిథులను సత్కరించి అభినందించారు. కచేరీలో సుందరంగా తీర్చిదిద్దిన వైవిధ్యమయ బొమ్మల కొలువు చూపరులను ఆకట్టుకుంది. – బెంగళూరు (సాంస్కృతికం), న్యూస్‌టుడే

## పెట్రోలు బంకును ప్రారంభించిన ముఖ్యమంత్రి

మైసూరు, న్యూస్‌టుడే : ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ సహకారంతో స్థానిక పారిశ్రామికవేత్త ఒకరు ఏర్పాటు చేసుకున్న ఎస్ఎన్ఎల్ ఫ్యూయల్ పార్కును ముఖ్యమంత్రి సిద్ధరామయ్య ఆదివారం ప్రారంభించారు. పెట్రోలు పంపుతో పాటు, వినియోగదారులకు కావలసిన వివిధ ఉత్పత్తులు, విశ్రాంతి గదులు, ఇతర సదుపాయాలు ఇక్కడ అందుబాటులో ఉన్నాయని నిర్వాహకులు తెలిపారు. మంత్రులు హెచ్‌సి మహదేవప్ప, వెంకటేశ్, ఎమ్మెల్యే జీటీ దేవెగౌడ, మాజీ మంత్రి శివణ్ణ తదితరులు ప్రారంభోత్సవంలో పాల్గొన్నారు.



సీఎంను సత్కరిస్తున్న మాజీ మంత్రి శివణ్ణ

## హోసూరు కబుర్లు

### విజేతలను సత్కరించిన ప్రముఖులు



లక్ష్మీచరణ్, వైష్ణవిలను సత్కరిస్తున్న కమ్మ సంఘం సభ్యులు

హోసూరు, న్యూస్‌టుడే : హోసూరు సమీపంలోని ఆబిరి గ్రామానికి చెందిన కుందారపల్లి సరస్వతి విద్యాలయంలో చదువుతున్న విద్యార్థులు లక్ష్మీచరణ్, పిళ్లే కొత్తూరు వైష్ణవి దిల్లీ గజియాబాద్‌లో జరిగిన ఎయిర్ రైఫిల్ జాతీయ పోటీల్లో రెండో స్థానంలో నిలిచి వెండి పతకాన్ని సాధించారు. విజేతలను హోసూరు కామరాజ కాలనీలోని కమ్మ భవనంలో ఆదివారం సత్కరించారు. బెంగళూరుకు చెందిన పారిశ్రామికవేత్త సుబ్రహ్మణ్యం తలా రూ.25 వేలు నగదు బహుమతి అందజేశారు. కమ్మ సంఘ భవనం నిర్వాహకులు, కమ్మ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో విద్యార్థులను అధ్యక్షుడు గోపాల్ అభినందించారు. కార్యక్రమంలో ప్రముఖులు లోకేష్, శ్రీరాములు, మారసంద్రం రామస్వామి, పుష్పసర్వేష్ పాల్గొన్నారు.

### కొత్త విద్యార్థులకు అక్షరాభ్యాసం



చిన్నారులకు అక్షరాభ్యాసం చేయిస్తున్న అర్చకులు

హోసూరు, న్యూస్‌టుడే : హోసూరు కార్పొరేషన్ కొత్తూరులోని అగస్త్య పాఠశాలలో అగస్త్య మహర్షి, సరస్వతీదేవికి ప్రత్యేక పూజలు చేశారు. ఒకటో తరగతిలో కొత్తగా ప్రవేశం పొందిన విద్యార్థులకు పూలమాల వేసి ఆహ్వానించారు. అర్చకులు అక్షరాభ్యాసం చేయించారు. ఈ సందర్భంగా పోషకులను పాఠశాల నిర్వాహకులు నటరాజన్, శివలింగం సత్కరించారు. ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

### గ్రంథాలయంలో కలాంకు పూజలు



కలాం చిత్రపటానికి నివాళులర్పిస్తున్న చెన్నీరప్ప తదితరులు

హోసూరు, న్యూస్‌టుడే : టీవీఎస్ నగర్‌లోని టి.వి.ఎస్ నగరలోని డాక్టర్ అబ్దుల్ కలాం గ్రంథాలయంలో విజయదశమి సందర్భంగా కలాం పటానికి కార్పొరేటర్ చెన్నీరప్ప నేతృత్వంలో నివాళులర్పించారు. సరస్వతి పూజలు చేశారు. కార్పొరేటర్ ఎన్.ఎస్. మాదేశ్వరన్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. గ్రంథాలయంలోని పుస్తకాలకు పూజలు నిర్వహించారు.

### అలరించిన భరతనాట్య ప్రదర్శన



నృత్యం చేస్తున్న కళాకారులు

హోసూరు, న్యూస్‌టుడే : న్యూ ఎ.ఎస్.టి.సి.కాలనీలోని పద్మశ్రీ కళామందిర్ వార్షికోత్సవం సందర్భంగా భరతనాట్య ప్రదర్శన నిర్వహించారు. 600 మంది కళాకారుల భరత నాట్య ప్రదర్శన ప్రేక్షకులను ఆకర్షించింది. ప్రదర్శనను ఇండియా బుక్ ఆఫ్ రికార్డ్స్, ఆసియా బుక్ ఆఫ్ రికార్డ్స్ ప్రతినిధులు పాల్గొని కళాకారుల ప్రతిభను పరిశీలించారు. కళాకారులను నిర్వాహకులు, నాట్య కళాకారుల గురువులైన ఎస్. కృష్ణన్, అంజర కృష్ణన్ ఘనంగా సత్కరించారు.

## భక్తిశ్రద్ధలతో దసరా ఉత్సవాల ముగింపు



జేపీనగరలో దాండేలి నృత్యంలో ఎంపీ తేజస్వీసూర్య, ఎమ్మెల్యే రామమూర్తి



మహిళలను సత్కరిస్తున్న కేంద్ర మంత్రి శోభాకరంద్లాజె, మాజీ మంత్రి గోపాలయ్య



జేపీనగరలో పూల పల్లకీలు



విగ్రహాల ముందు స్వీయ చిత్రాలు తీసుకుంటున్న మహిళలు

బెంగళూరు (యశ్వంతపుర), న్యూస్‌టుడే : నగరంలోని వివిధ ప్రాంతాల్లో వివిధ సంస్థలు ఏర్పాటు చేసిన దసరా ఉత్సవాలు ఘనంగా జరిగాయి. శనివారం రాత్రి ఉత్సవాల ముగింపు సందర్భంగా సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. నందినీలేఔట్, జయనగర, జేపీనగర, విజయనగర, కాటన్‌పేట, చిక్కపేట, హలసూరు, కృష్ణరాజపురం, దొమ్మలూరు, మారతహళ్లి, వైట్‌ఫీల్డ్ తదితర ప్రాంతాల్లో శరన్నరాత్రి ఉత్సవాలు అట్టహాసంగా జరిగాయి. నందినీలేఔట్‌లో జరిగిన సాంస్కృతిక కార్యక్రమాలు ప్రజలకు ఆకట్టుకుంటున్నాయి. ఈసందర్భంగా కేంద్ర మంత్రి శోభాకరంద్లాజె, మాజీ మంత్రి గోపాలయ్య తదితరులు వివిధ రంగాల్లో ఖ్యాతి పొందిన మహిళలను సత్కరించారు. జేపీనగరలో ఏర్పాటు చేసిన దాండేలి నృత్య ప్రదర్శనలో ఎంపీ తేజస్వి సూర్య, ఎమ్మెల్యే రామమూర్తి తదితరులు పాల్గొన్నారు. అక్కడ మహిళలు, బాలలతో కలిసి నృత్యం చేశారు. సామూహిక భోజనం చేశారు. 25 పూల పల్లకీలు ఊరేగింపుగా పురవీధుల్లో సంచరించాయి.



విదుషీమణుల సంగీత కచేరి

### నేత్రానందంగా సాంస్కృతికోత్సవాలు

బెంగళూరు (సాంస్కృతికం) : నగరంలోని సాంస్కృతిక శిక్షణాసంస్థ పద్మావతి కళానికేతన్ 43 ఏళ్లుగా ఏటా నవ రాత్రుల సమయంలో సుందర సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహిస్తోంది. ఈ ఏడాది నాలుగు రోజుల పాటు సంగీత నృత్య, వాద్య కార్యక్రమాలు విజయవంతంగా నిర్వహించింది. సంస్థ కార్యదర్శి జి.వేణుగోపాల్, ముఖ్య అతిథుల ఆధ్వర్యంలో నిత్యం సాయంత్రం సమయంలో శ్రీవాసవి చౌడేశ్వరి మహిళా సమాజంలో శిరిడి సాయిబాబా భజనలు ఆలపించారు. సంస్థ విద్యార్థులతో సంగీత కచేరి, గురు సుష్మాశ్రీధర్ కూచిపూడి నృత్య ప్రదర్శన ప్రేక్షకులను రంజింపజేసింది. విద్యార్థుల వీణావాదన అనంతరం వైణిక విద్వాన్ సి.ఎన్.ధనంజయ్ బృందంతో పంచవీణ వాదన, గురు శాలినీ శ్రీకాంత్ ప్రస్తుత పరచిన భరతనాట్య ప్రదర్శన ప్రేక్షకులను మంత్రముగ్ధుల్ని చేసింది. మహామంగళ హారతితో సాంస్కృతికోత్సవాలు ముగిశాయి.

### ముగిసిన నిమజ్జనాలు

బెంగళూరు (శివాజీనగర) : ఉద్యాననగరిలోని బెంగాలీ సంఘాలు దుర్గామాత, దసరా వేడుకలను ఘనంగా ఆచరించుకున్నాయి. తమ నివాసాలు, నివాస సముదాయాల ఆవరణల్లో ప్రతిష్ఠాపించుకున్న కాళీమాత విగ్రహాలను హలసూరు, స్యాంకీ చెరువుల్లో నిమజ్జనానికి ఊరేగింపుగా తీసుకువచ్చారు. సంప్రదాయ దుస్తులు ధరించి అమ్మవారి విగ్రహాల ముందు నృత్యాలు చేశారు. వరుస సెలవులు ఉండడంతో ఎక్కువ మంది వేడుకల్లో పాల్గొన్నారు. నిమజ్జన అనంతరం పండుగకు సంప్రదాయ వంటకాలతో విందు ఏర్పాటు చేసుకున్నారు.



నృత్యాలు చేస్తున్న బెంగాలీ మహిళలు



వైణికులచే వీణా కచేరి



దుర్గామాత విగ్రహాల నిమజ్జనం

### గ్రామదేవత మారెమ్మదేవికి నవమి పూజలు

బెంగళూరు (జాలహళ్లి) : కమ్మగుండనహళ్లిలో గ్రామదేవత మారెమ్మదేవి నవరాత్రి ఉత్సవాలను కేబీసీ ట్రస్టు ఛైర్మన్ కె.సి.ఆశోక్ అధ్వర్యంలో ఘనంగా జరిగాయి. ఉత్సవాల్లో ఆలయ నిర్వాహకులు కె.సి.రోషన్ అశోక్, ట్రస్టు పదాధికారులు, ప్రజలు పాల్గొన్నారు. శెట్టిహళ్లిలో భాజపా అధ్యక్షుడు బి.సురేష్ దంపతులు తమ వాహనాలకు పూజలు చేసి కార్మికులకు దుస్తులు, మిఠాయిలు పంచిపెట్టారు. లక్ష్మీపురలో చిక్కభైరప్ప వాహనాలకు పూజలు చేయించారు. రాఘవేంద్రప్రతాప్ సింగ్, నాయకులు, భక్తులు పాల్గొన్నారు.



ఆయుధపూజలో సురేష్, తదితరులు

### హెరోహళ్లిలో వేడుకలు



బన్నిపూజలో సోమశేఖర్ తదితరులు

బెంగళూరు (కెంగేరి) : యశ్వంతపుర విధానసభా క్షేత్రం ఎమ్మెల్యే కార్యాలయంలో నిర్వహించిన దసరా ఉత్సావాలు చాముండేశ్వరికి మంగళహారతి, బన్నిపూజాతో ముగిశాయి. కెంగేరి సమీపంలోని హెరోహళ్లిలో ఎమ్మెల్యే ఎస్.టి.సోమశేఖర్ సహకారంతో తొమ్మిది రోజుల పాటు బొమ్మలకొలువు ఏర్పాటు చేసి ఉత్సావాలను ఘనంగా ఆచరించారు. శనివారం రాత్రి ఎమ్మెల్యే బన్నిపూజాలో పాల్గొన్నారు. హాస్య కళాకారుడు మిమిక్రీ గోపి హాస్య ప్రసంగాలు నవ్వుల ప్రపంచంలో తేలేలా చేశాయి. వేడుకలకు సహకరించిన పురోహితులు, మహిళా కార్యకర్తలు, అభిమానుల బళగ సభ్యులు, గ్రామ పెద్దలు, భక్తులకు ఎమ్మెల్యే కృతజ్ఞతలు తెలిపారు.

### శరణ సంస్కృతి జానపద కళామేళా

చిత్రదుర్గం : విజయదశమి సందర్భంగా శరణ సంస్కృతి దసరా జానపద కళామేళా ప్రజలను ఆకట్టుకొంది. మురుఘరాజేంద్ర బృహన్మఠం నుంచి ప్రారంభమైన ఊరేగింపు చిత్రదుర్గం పట్టణ ప్రధాన వీధుల గుండా సాగి చిత్రదుర్గం కోటలోని మురుఘా మఠం ఆవరణ వద్ద ముగిసింది. కళామేళాను మురళీధర హాలప్ప ప్రారంభించారు. ఆధ్యాత్మిక గురువులు, మాతల చిత్రపటాలను ట్రాక్టర్లపై ఊరేగించారు. మఠాధిపతులు బసవ కుమారస్వామి, బసవ ప్రభు స్వామి, బసవమూర్తి మాదార చెన్నయ్యస్వామి, పట్టణాభివృద్ధి సంస్థ అధ్యక్షుడు తాజ్‌పీర్, పటేల్ శివకుమార్, చంద్రశేఖర్, వందలాది మంది జానపద కళాకారులు పాల్గొన్నారు.



కళామేళాలో ఏనుగు సవారీ, భక్తులు, ప్రజలు

## కాంగ్రెస్‌లో చేరిన ఏఐఏడీఎంకే అధ్యక్షురాలు



కృష్ణగిరి ఎంపీ గోపీనాథ్ సమక్షంలో పార్టీలో చేరిన నాయకులు

హోసూరు, న్యూస్‌టుడే : కృష్ణగిరి జిల్లా ఎ.ఐ.ఎ.డి.ఎం.కె మహిళా విభాగం అధ్యక్షురాలు ఎస్.మేఘన నేతృత్వంలో పలువురు కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఆదివారం ఎంపీ కె.గోపినాథ్ నివాసంలో ఈమెతో పాటు ఇతర నాయకులు, మహిళలు కాంగ్రెస్ సభ్యత్వం స్వీకరించారు. కార్యక్రమంలో నాయకులు సాధిక్, నెర్లీకర్, మంజునాథ్, రాజగోపాల్, చిన్నగుట్టప్ప తదితర కాంగ్రెసు ప్రముఖులు పాల్గొన్నారు.

## ముగిసిన విజయదశమి



కాళరాత్రిమాతగా దుర్గాపరమేశ్వరిదేవి

బాగలూరు (బేరికె), న్యూస్‌టుడే : బాగలూరు తేరుపేటలోని దుర్గాపరమేశ్వరిదేవి దేవాలయంలో ఆలయ ధర్మకర్త మునిలక్ష్మితిమ్మరాయప్ప ఆధ్వర్యంలో జరిగిన శరన్నవరాత్రి, విజయదశమి ఉత్సవాలు వైభవంగా ముగిశాయి. అమ్మవారిని కాళరాత్రిమాతగా, రాజరాజేశ్వరి, చాముండేశ్వరి, కైలాసనాథేశ్వరిగా అలంకరించారు. భక్తులు అమ్మవారికి పూజలుచేసి మొక్కులు తీర్చుకుని దర్శనం చేసుకున్నారు. ఆలయ ట్రస్టు కార్య నిర్వాహకులు పాల్గొన్నారు. అత్తిబెలె పట్టణంలోని శ్రీక్షేత్ర రాచమానహళ్ళి దేవాలయంలో ఉత్సవాలు వైభవంగా జరిగాయి.

## కుస్తీ పోటీలను వీక్షించిన రాజమాత



ఆధ్యావీర్‌తో కలిసి పోటీలను వీక్షిస్తున్న రాజమాత

బెంగళూరు (క్రీడలు), న్యూస్‌టుడే : మైసూరు దసరా ఉత్సవాల సందర్భంగా నిర్వహించిన వజ్రముష్టి కుస్తీ పోటీలను రాజమాత ప్రమోదాదేవి, మనవడు ఆధ్యావీర్‌తో కలిసి ప్యాలెస్ బంగ్లా నుంచే వీక్షించారు. గత ఏడాది కోడలు త్రిషికకుమారితో ఈ పోటీలను వీక్షించారు. ప్యాలెస్‌లోని కరికల్లు తొట్టి ప్రాంగణంలో కుస్తీపోరు ప్రారంభానికి ముందు జెట్టీలు, రెఫరీ, స్థానికులు రాజమాతకు నమస్కరించారు. బరిలో నలుగురు జెట్టీలు పాల్గొన్నారు. పోరులో తొమ్మిదో సారి నగరవాసి నారాయణ్, నాలుగో సారి మైసూరుకు చెందిన బలరామ్‌జట్టి, మూడోసారి చామరాజనగరకు చెందిన శ్రీనివాసజట్టి, తొలి సారిగా చెన్నపట్టణకు చెందిన రాఘవేంద్రజట్టి ఈ పోరులో పాల్గొన్నారు. యదువీర్ కృష్ణదత్తా ఫైల్వాన్లకు కానుకలు అందజేశారు.

## ఆచార్య సాయిబాబాకు నివాళులు



ఆచార్య సాయిబాబా చిత్రపటానికి నివాళులు అర్పిస్తూ..

బెంగళూరు (యశ్వంతపుర), న్యూస్‌టుడే : దిల్లీ విశ్వవిద్యాలయం మాజీ ఆచార్యుడు సాయిబాబా మృతికి కర్ణాటక భవన కట్టడ కార్మిక సంఘం ఆధ్వర్యంలో ఆదివారం ఇక్కడ ఘట్టిభవన్‌లో ఆయన చిత్రపటానికి పువ్వులు వేసి నివాళులు ఆర్పించారు. ఈ సందర్భంగా సంఘాల నాయకుడు గురవయ్య మాట్లాడుతూ రాజ్యాన్ని ప్రశ్నిస్తున్న మేధావులను పాలకులు పొట్టన పెట్టుకుంటున్నారని, సాయిబాబా మృతి చెందలేదని, రాజ్యం హత్య చేసిందని తెలిపారు. చేయని నేరానికి పదేళ్ల పాటు జైల్లో ఒంటరి జీవితాన్ని గడిపి గత మార్చిలో విడుదలైన సాయిబాబా ఆరోగ్యం పాడైందని, అందుకు ప్రభుత్వం ప్రధాన కారణమన్నారు. ఆయన మృతి ప్రజాస్వామ్య శక్తులకు తీరని లోటని వ్యాఖ్యానించారు.

## మౌలిక సదుపాయాలను వృద్ధి చేస్తాం



మంత్రులతో కలిసి శిలాఫలకాలను ఆవిష్కరిస్తున్న సిద్ధరామయ్య



స్థానికులను ఉద్దేశించి ప్రసంగిస్తున్న సిద్ధరామయ్య




శఠగోపంతో ఆశీర్వదిస్తున్న అర్చకుడు

బెళగావి, న్యూస్‌టుడే: సవదత్తి రేణుకా ఎల్లమ్మ దేవాలయానికి వచ్చే భక్తులకు మరింత మెరుగైన సదుపాయాలు కల్పించేందుకు మౌలిక సదుపాయాలను వృద్ధి చేస్తామని ముఖ్యమంత్రి సిద్ధరామయ్య తెలిపారు. దేవాలయం అభివృద్ధి ప్రాధికార మొదటి సభను మంత్రులతో కలిసి ఆయన ఆదివారం నిర్వహించారు. పర్యాటక మండలి, దేవాదాయ శాఖ, అభివృద్ధి ప్రాధికార సంయుక్తంగా అభివృద్ధి పనులు చేపడతాయని తెలిపారు. ఈ ఆలయానికి ఏటా రెండు కోట్ల మంది భక్తులు వచ్చి వెళుతున్నారని గుర్తు చేశారు. ఆలయానికి అనుబంధం 1087 ఎకరాల భూమి అందుబాటులో ఉందని, అక్కడ గోశాల, భోజనశాల, పార్కింగ్, వసతి సదుపాయాలను కల్పించేందుకు చర్యలు తీసుకుంటామని వివరించారు. మహిళా, శిశు సంక్షేమ శాఖ ఇక్కడ నిర్మించిన వాణిజ్య సముదాయాన్ని సీఎం ప్రారంభించారు. పలు అభివృద్ధి పనులకు శంకు స్థాపన చేశారు. బెళగావిలో జిల్లా అభివృద్ధికి ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలను బహిరంగ సభలో వివరించారు. ఉప ముఖ్యమంత్రి డీకేశివకుమార్, మంత్రులు హెచ్‌కే పాటిల్, రామలింగారెడ్డి, సతీశ్ జార్కిహొళి, లక్ష్మీ హెబ్బాళ్కర్, ఎమ్మెల్యే విశ్వాస్ వైద్య తదితరులు ఈ కార్యక్రమాల్లో పాల్గొన్నారు.

### భార్య పేరిట అర్చన

బెళగావి, న్యూస్‌టుడే : ముఖ్యమంత్రి సిద్ధరామయ్య తన భార్య పార్వతి పేరిట సవదత్తి ఎల్లమ్మ దేవాలయంలో ఆదివారం రాత్రి పూజ, అర్చన చేయించుకున్నారు. ముడా అక్రమాల్లో తన భార్య పేరును ఎఫ్ఐఆర్‌లో చేర్చినప్పటి నుంచి ఆయన ఆందోళనకు గురయ్యారు. రాజకీయ కక్ష సాధింపులకు కుటుంబ సభ్యులను విపక్షాలు లాగుతున్నాయని దుయ్యబట్టారు. సవదత్తి ఎల్లమ్మను దర్శించుకుని తన భార్య పార్వతి, ధనిష్ఠా నక్షత్రం పేరిట అర్చన చేయాలని అర్చకులను ఆయన కోరారు.

## దేశానికి ప్రధాని మోదీ సేవలు అపారం



దసమానోత్సవాన్ని ప్రారంభిస్తున్న కేంద్రమంత్రి సోమణ్ణ తదితరులు

తుమకూరు : ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పథకాలు, దేశానికి అందించిన సేవలు అపారమని కేంద్ర మంత్రి వి. సోమణ్ణ పేర్కొన్నారు. ప్రధాని త్వరలో తుమకూరు జిల్లాకు అతిపెద్ద పథకాన్ని ప్రకటించనున్నారని తెలిపారు. తుమకూరులోని జిల్లా డిజిటల్ లైబ్రరీ సభాప్రాంగణంలో ఆదివారం జిల్లా రైల్వే ప్రయాణికుల వేదిక దసమానోత్సవాన్ని కేంద్ర మంత్రి ప్రారంభించి మాట్లాడారు. నేను మంత్రి కాగలనని ఎప్పుడూ ఊహించి లేదని, అనుకోకుండా కేంద్ర రైల్వే మంత్రిగా అవకాశం వచ్చిందన్నారు. తుమకూరు ప్రజలు, సిద్ధగంగామఠం స్వాముల ఆశీర్వాదంలో మంత్రి అయినట్లు తెలిపారు. పెండింగ్‌లో ఉన్న రైల్వే పథకాలను వేగవంతం చేస్తామన్నారు. తుమకూరు రైల్వేస్టేషన్‌ను రూ.88 కోట్లతో అత్యాధునిక స్టేషన్‌గా తీర్చిదిద్దుతామన్నారు. రైల్వే ఉద్యోగాలకు పరీక్షలను కన్నడ భాషలోను రాయడానికి అవకాశం కల్పించామన్నారు. రైల్వే అభివృద్ధికి సంబంధించిన మన రైలు అనే పుస్తకాన్ని మంత్రి ఆవిష్కరించారు. ఈసందర్భంగా నగర ఎమ్మెల్యే జ్యోతిగణేష్ ఎస్ఎస్ఎల్‌సీ, పీయూసీలో మంచి మార్కులు సాధించిన విద్యార్థులకు ప్రతిభా పురస్కారాలతో సత్కరించారు. మాజీ ఎం.పి.బసవరాజ్, దసమానోత్సవ సమితి అధ్యక్షుడు బి.కె.జయప్రకాష్, జిల్లాధికారి శుభాకల్యాణ్, రైల్వే ప్రయాణికుల వేదిక అధ్యక్షురాలు రమాకుమారి, మాజీ ఎమ్మెల్సీ హులినాయక్ , మురళీధర్‌హాలప్ప, శివప్రసాద్ హుచ్చయ్య, వేదిక పదాధికారులు పాల్గొన్నారు.

## విద్యుదాఘాతంతో కార్మికుడి మృతి

కలబురగి, న్యూస్‌టుడే : అఫ్జల్‌పుర తాలూకా కరజగి ప్రభుత్వ ఆసుపత్రిలో పని చేస్తున్న శివపుత్ర (30) అనే వ్యక్తి విద్యుదాఘాతంతో మరణించారు. ఆసుపత్రిపై అంతస్తులో ట్యాంకులో నీరు నిండడంతో అక్కడకు వెళ్లిన సమయంలో అక్కడ తెగి పడిన తీగ తగలడంతో షాక్ కొట్టి మరణించారు. అఫ్జల్‌పుర ఠాణా పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

## ఉత్తరాదికి పోలీసుల పయనం

బెంగళూరు (గ్రామీణం) : నగర శివార్లలోని జిగణి, నగర మధ్యభాగం పీణ్య, దావణగెరె తదితర ప్రాంతాల్లో గత నెల రోజుల్లో 19 మంది పాకిస్థాన్ పౌరులను నగర పోలీసులు అరెస్టు చేశారు. వీరి నుంచి రాబట్టిన సమాచారం ఆధారంగా దిల్లీ, చెన్నై, ఉత్తరాది రాష్ట్రాలకు వెళ్లి దర్యాప్తును కొనసాగించనున్నారు.

## కొడుకు చేతిలో తండ్రి హత్య

బెంగళూరు (గ్రామీణం), న్యూస్‌టుడే : ఎక్కడకు వెళ్లినా చెడ్డీ (నిక్కరు) వేసుకునే వెళ్తున్న వేలాయుధన్ (76) అనే వ్యక్తిని అతని కుమారుడు వినోద్ కుమార్ (45) హత్య చేశాడు. కేరళలోని ఏరిమలెకు చెందిన వేలాయుధన్ కొన్నేళ్లుగా బన్నేరుఘట్ట సమీపంలోని జనతా కాలనీలో ఉంటున్నారు. సౌకర్యంగా ఉంటుందని ఎప్పుడూ నిక్కర్ ధరించి తిరిగేవారు. శనివారం రాత్రి ఇదే విషయమై తండ్రితో గొడవపడిన వినోద్ కుమార్ కత్తితో తండ్రిపై దాడి చేశాడు. తీవ్రంగా గాయపడిన బాధితుడ్ని ఆసుపత్రికి తరలించేలోగా మరణించారు. బన్నేరుఘట్ట ఠాణా పోలీసులు వినోద్ కుమార్‌ను అరెస్టు చేసి విచారణ చేపట్టారు.

## బాలికపై వీధి కుక్కల దాడి

బెంగళూరు (మల్లేశ్వరం), న్యూస్‌టుడే : తన ఇంటి సమీపంలో వెళ్తున్న ఒక బాలిక (7)పై వీధి కుక్కలు దాడి చేశాయి. దాడిలో తీవ్రంగా గాయపడిన బాలికను చికిత్స కోసం జాలహళ్లిలోని ప్రభుత్వ ఆసుపత్రిలో చేర్పించారు. జాలహళ్లి ఎయిర్‌ఫోర్స్ క్యాంపస్ సమీపంలో వీధి కుక్కల సంఖ్య ఎక్కువైందని స్థానికులు ఆరోపించారు. ఒక అధ్యయనం ప్రకారం నగరంలో 2.79 లక్షల వీధి కుక్కలు ఉన్నాయి.

## దంపతులకు అరదండాలు



పారిజాత, ప్రకాశ్

బెంగళూరు (సదాశివనగర), న్యూస్‌టుడే : ఈవెంట్ మేనేజ్‌మెంట్ పేరిట ఉద్యోగాలు ఇస్తామని నమ్మించి, ఉత్తర కర్ణాటక, ఇతర రాష్ట్రాలకు చెందిన యువతులను బలవంతంగా పడుపు వృత్తిలోకి దించుతున్న పారిజాత, ప్రకాశ్ అనే దంపతులను గోవిందరాజనగర ఠాణా పోలీసులు అరెస్టు చేశారు. వీరి చెర నుంచి నలుగురు యువతులను రక్షించారు. రిసార్టుల్లో పార్టీ చేసుకునేందుకు వచ్చే యువతకు వీరు అమ్మాయిలను సరఫరా చేసే వారు. ఒక్కో యువతిని పంపించినందుకు రూ.25వేల, రూ.50 వేల వరకు వసూలు చేసేవారు. బెంగళూరు శివార్లలోని రిసార్టులతో పాటు తమిళనాడులోని రిసార్టులకూ వీరు యువతులను సరఫరా చేసేవారని ప్రాథమిక దర్యాప్తులో గుర్తించారు. నిందితుల నుంచి మరిన్ని వివరాలు రాబట్టేందుకు విచారణ తీవ్రం చేశారు.

## తొమ్మిది మంది బంగ్లా పౌరుల అరెస్టు

ఉడుపి, న్యూస్‌టుడే : అక్రమ మార్గంలో కర్ణాటకకు చేరుకుని ఉడుపిలో ఉంటున్న తొమ్మిది మంది బంగ్లా పౌరులను పోలీసులు అరెస్టు చేశారు. మత్స్యకారులుగా, చేపల వ్యాపారం కోసం ఉడుపిలో వీరు ఉంటున్నారు. మహ్మద్ మాణిక్ అనే వ్యక్తి నకిలీ పాస్‌పోర్టుతో మంగళూరు నుంచి దుబాయ్‌కు వెళ్లేందుకు ప్రయత్నించి గత వారం పట్టుబడ్డాడు. అతన్ని విచారణ చేసిన అనంతరం మల్పెలో హకీం అలి, సుజోన్, ఇస్మాయిల్, కరీం, సలాం, రాజికుల్, మహ్మద్ సోజిబ్, కాజోల్, ఉస్మాన్‌లను శనివారం అరెస్టు చేశారు. వీరి నుంచి నకిలీ ఆధార్ కార్డులు, ఇతర గుర్తింపు కార్డులను జప్తు చేసుకున్నారు.

## ఉద్యోగం ఊడింది

బెంగళూరు (శివాజీనగర), న్యూస్‌టుడే : సంప్రదాయబద్ధంగా దుస్తులు ధరించి కంపెనీకి వెళ్లమని నీ భార్యకు చెప్పు. లేదంటే నీ మొహం మీద యాసిడ్ పోస్తానని బెదిరింపులకు పాల్పడిన నికిత్ శెట్టి ఉద్యోగాన్ని కోల్పోయారు. తనను, తన భార్యను వేధిస్తున్న నికిత్ శెట్టిపై చర్యలు తీసుకోవాలని శహబాజ్ అన్సర్ అనే వ్యక్తి ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రి, డీజీపీలకు ట్యాగ్ చేస్తూ ఫిర్యాదు చేశారు. పోలీసులు నికిత్ శెట్టిపై కేసు నమోదు చేసుకున్నారు. ఎటియోస్ డిజిటల్‌లో పని చేస్తున్న నికిత్‌ను విధుల నుంచి తప్పించామని సంస్థ ప్రతినిధులు ప్రకటించారు.

# బళ్ళారి

•బళ్ళారి •రాయచూరు

## నేడు ఆర్‌ఎస్‌ఎస్ పథ సంచలనం

**రాయచూరు, న్యూస్‌టుడే :** విజయదశమిని పురస్కరించుకుని ఆర్‌ఎస్‌ఎస్ సోమవారం రాయచూరులో పథ సంచలనం నిర్వహిస్తోంది. సాయంత్రం 4.15 గంటలకు వీరాంజనేయ మున్నూరు కాపు కల్యాణ మంటపం వద్ద మొదలవుతుంది. బసవణ్ణబావి కూడలి, మాతా లక్ష్మమ్మ దేవస్థానం రహదారి, పటేల్ కూడలి, శెట్టి బావి చౌక్, బంగారు బజారు, తీనకందిల్, బట్టె బజార్, మహావీర కూడలి, హరిహర రస్తా, చంద్రమౌళేశ్వర కూడలి, గంజ్ రహదారి మీదుగా సంచరించి తిరిగి బసవణ్ణబావి కూడలి మీదుగా వీరాంజనేయ కల్యాణ మంటపానికి చేరుకుంటుందని జిల్లా సంఘ్ సంచాలకుడు సదానంద ప్రభు తెలిపారు. రాయచూరు విశ్వవిద్యాలయం ఉప కులపతి ఆచార్య హరీష్ రామస్వామి, కర్ణాటక ఉత్తర, దక్షిణ ప్రాంతాల ప్రచార విభాగం (హుబ్బళ్లి) ప్రముఖుడు అరుణకుమార్ పాల్గొంటారని వివరించారు.

## కాలువలో తల్లీకూతురు గల్లంతు

**రాయచూరు, న్యూస్‌టుడే :** దుస్తులు ఉతికేందుకు వెళ్లిన తల్లీకూతురు కాలువలో పడి గల్లంతయ్యారు. ఈ విషాద సంఘటన ఆదివారం ఉదయం రాయచూరు తాలూకా బి.యద్లాపూర్ గ్రామ పరిధిలో సంభవించింది. సదరు గ్రామానికి చెందిన సుజాత (27), కుతురు శ్రావణి (10) ఇద్దరూ ఆర్‌డీఎస్ (రాజులబండ డైవర్షన్ స్కీమ్ కాలువ) వద్దకు వెళ్లారు. దుస్తులు ఉతుకుతున్న సమయంలో బాలిక ప్రమాదవశాత్తు నీటిలో జారి పడింది. కూతురును రక్షించుకునేందుకు వెళ్లిన తల్లి నీటిలో చిక్కుకుంది. నీటి ప్రవాహం ఉన్నందున కొట్టుకుపోయారు. గ్రామస్థుల సమాచారంతో కాలువ వద్దకు యరగేరా ఠాణా పోలీసులు చేరుకున్నారు. ఈతగాళ్లతో వెతికించినా జాడ దొరకలేదు. నీటి ప్రవాహం తగ్గాక అన్వేషిస్తున్నారు.



విభూతిపుర చెరువు

## చెరువుల దుస్థితిపై హరిత న్యాయస్థానం తాఖీదులు



దొడ్డనెక్కుంది చెరువు దుస్థితి

**బెంగళూరు (యశ్వంతపుర), న్యూస్‌టుడే :** రాష్ట్ర రాజధాని బెంగళూరు నగరంలోని విభూతిపుర, దొడ్డనెక్కుంది చెరువుల్లో నెలకొన్న మాలిన్యం, ఆక్రమణల గురించి చెన్నైలో ఉన్న దక్షిణాది హరిత న్యాయస్థానం, బృహత్ బెంగళూరు మహానగర, బెంగళూరు నగర జిల్లాధికారి, రాష్ట్ర మాలిన్య నియంత్రణ మండలికి తాఖీదులు జారీ చేసింది. రెండు చెరువులు ఐటీ కారిడార్ ప్రదేశంలో ఉన్నాయి. చుట్టూ ఐటీ పరిశ్రమలు, నివాస ప్రదేశాలు ఉన్నాయి. వాటిల్లో వచ్చే మురుగు నీరు నేరుగా చెరువుల్లోకి చేరడంతో అవి కాస్త మలినమవుతున్నాయి. ఫలితంగా భూగర్భ జలాలూ మాలిన్యం కావడంతో చుట్టు పక్కల ప్రజలు హరిత న్యాయస్థానానికి ఫిర్యాదు చేశారు. మురుగునీరు చెరువుల్లోకి రాకుండా నియంత్రించాలని, చెరువు ఆక్రమణలు తొలగించాలని తాఖీదులు ఇచ్చింది. పాడైన చెరువులను శుద్ధీకరించాలని ఆదేశాలు జారీ చేసింది. హరిత న్యాయస్థానం తాఖీదుకు సమాధానం ఇవ్వడంతోపాటు సూచించినట్లు రెండు చెరువులను బాగు చేస్తామని అధికారులు తెలిపారు.

# హస్తినపై సమర భేరి!

➤ పన్నుల వాటా కోసం మళ్లీ పట్టు ➤ దశలవారీగా పోరుకు సర్కారు కసరత్తు



గత ఫిబ్రవరిలో దిల్లీలో ఆందోళన చేపడుతున్న రాష్ట్ర మంత్రులు, కాంగ్రెస్ నేతల బృందం

**ఈనాడు, బెంగళూరు:** కేంద్ర ప్రభుత్వంపై రాష్ట్ర సర్కారు మరోసారి పోరుకు సిద్ధమైంది. కాకపోతే ఈసారి రాజకీయపరమైన అంశాలతో కాదు.. సమాఖ్య ప్రజాస్వామ్యంలో రాష్ట్రాలకు దక్కాల్సిన వాటాపై భాజపాయేతర ప్రభుత్వాలున్న రాష్ట్రాలపై కేంద్రం సవతితల్లి ధోరణిని అవలంబిస్తోందని ఇప్పటికే పలుమార్లు దుమ్మెత్తి పోసిన కాంగ్రెస్ సర్కారు ప్రతి త్రైమాసికంలో రాష్ట్రానికి జరిగే అన్యాయాన్ని బహిరంగంగా ప్రశ్నిస్తోంది. ఆర్థిక సంఘాల సిఫార్సులను కేంద్రం ఉద్దేశపూరితంగా తోసిపుచ్చుతోందంటూ సర్కారు శాసనసభ సమావేశాల్లోనూ గట్టిగానే ప్రస్తావించింది. గత ఫిబ్రవరిలో దిల్లీలోని జంతర్‌మంతర్‌లో రాష్ట్ర ప్రభుత్వమంతా సమావేశమై కేంద్ర సర్కారు నిర్లక్ష్యాన్ని నిలదీసింది. ఇన్ని రోజుల తర్వాత మళ్లీ అదే అంశంతో దశలవారీగా కేంద్రంపై నిరసన వ్యక్తం చేసేందుకు సిద్ధమైంది.

**పోరు బాట**

ఏటేటా కేంద్ర బడ్జెట్‌లోనూ అంతగా దక్కని నిధులు, ఆర్థిక సంఘాల సిఫార్సులను లక్ష్యపెట్టని తీరు, ప్రతి త్రైమాసికంలో నిబంధనలకు విరుద్ధంగా రాష్ట్రానికి దక్కుతున్న వాటా.. ఇలాంటి అంశాలపై కేంద్రంపై దశలవారీగా నిలదీసే కార్యక్రమాలు చేపట్టాలని సర్కారు నిర్ణయించింది. ఇందు కోసం రానున్న శీతాకాల సమావేశాల్లో సభలో చర్చలు, అఖిలపక్ష సమావేశం, మంత్రివర్గ సమావేశాల్లో కేంద్రం తీరుపై తీర్మానాలు, రాష్ట్ర, దేశ రాజధానుల్లో ఆందోళన చేపట్టాలని నిర్ణయించారు. మంత్రుల బృందాలు వేర్వేరుగా కేంద్ర మంత్రులతో భేటీలు, మనవి పత్రాలతో కేంద్రంపై ఒత్తిడి, దక్షిణ భారత రాష్ట్రాల ఆర్థిక మంత్రులతో ప్రత్యేక సమావేశాలను నిర్వహించాలని సర్కారు తీర్మానించింది.

### తాజా వాటాపై అసమ్మతి జ్వాల

కేంద్ర ప్రభుత్వం ఇటీవల రాష్ట్ర ప్రభుత్వాలకు రూ.1.78 లక్షల కోట్ల పన్నుల వాటాను ప్రకటించింది. ఈ వాటాలో రాష్ట్రానికి దక్కిన సొమ్ముపై ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రులు భగ్గుమన్నారు. ఏ రాష్ట్రంతో పోల్చినా అతి తక్కువ వాటా పొందిన రాష్ట్రాల్లో కర్ణాటక ఒకటి. కేంద్రం వసూలు చేసే పన్నుల నుంచి రూ.6,498 కోట్లు మాత్రమే కర్ణాటకకు విడుదల చేసినట్లు ముఖ్యమంత్రి ధ్వజమెత్తారు. గత త్రైమాసికంతో పోలిస్తే రూ.2వేల కోట్ల తక్కువ వాటా దక్కడంతో సర్కారు తీవ్ర అసంతృప్తికి గురైంది. కేంద్రం నుంచి పదేపదే జరుగుతున్న అన్యాయాన్ని రాజకీయాలకు అతీతంగా ప్రశ్నించాలని ఆయన పిలుపునిచ్చారు. రాష్ట్రం నుంచి అత్యధిక సంఖ్యలో ఎంపీలు గెలిచిన వారెవరూ రాష్ట్రానికి జరుగుతున్న అన్యాయం గురించి నోరు మెదపరని ఆరోపించారు. ప్రధాని ముందు నిలబడే ధైర్యం లేని భాజపా ఎంపీలు ఇక్కడి సర్కారును నిత్యం ఆరోపిస్తుంటారన్నారు. ఎంపీలతో పాటు కేంద్ర మంత్రులుగా ఉన్న ప్రహ్లాద్ జోషి, కుమారస్వామి సీనియర్లు సైతం రాష్ట్రం కోసం సభలో ప్రశ్నించే సత్తా లేదన్నారు.

### దుష్పరిపాలనకు మా సహకారమా?

కేంద్రం ప్రకటించిన పన్నుల వాటాలో కర్ణాటకకు దక్కింది రూ.6,498 కోట్లు. చెత్త పరిపాలనతో పేరు పొందిన ఉత్తరప్రదేశ్‌కు ఈసారి రూ.31,962 కోట్లు దక్కినట్లు ముఖ్యమంత్రి సిద్ధరామయ్య మండిపడ్డారు. బిహార్‌కు రూ.17,921 కోట్లు, మధ్యప్రదేశ్‌కు రూ.13,987 కోట్లు, రాజస్థాన్‌కు రూ.10,737 కోట్లు కేటాయించారు. పదివేల కోట్లకు పైగా వాటా పొందిన రాష్ట్రాల్లో ఎక్కువ శాతం పాలనలో వైఫల్యం చెందిన ప్రభుత్వాలున్నాయి. మాలాంటి రాష్ట్రాల నుంచి సేకరించిన పన్నులను ఇతర రాష్ట్రాలకు మళ్లిస్తున్నారు. అంటే దుష్పరిపాలన అందిస్తున్న రాష్ట్రాలకు మేము సహకరిస్తున్నట్లుగా ఉందని సిద్ధరామయ్య అభిప్రాయపడ్డారు. పన్నుల వాటాల్లో హేతుబద్ధతను పాటించాలన్న కనీస నిబంధనను కేంద్రం విస్మరిస్తోంది. మేము ప్రశ్నించిన ప్రతిసారీ అభివృద్ధి చెందిన రాష్ట్రాలకు కేంద్ర పన్నుల వాటా తక్కువగా ఉంటుందని బదులిస్తోంది. పైగా జనసంఖ్య ఆధారంగా నిధులు కేటాయించాలన్న నిబంధనను కూడా కేంద్రం గుర్తు చేస్తోంది. కేంద్రమే ఇచ్చిన జనాభా నియంత్రణ పిలుపును అందిపుచ్చుకోవటమే మేము చేసిన నేరమా? అని ముఖ్యమంత్రి ప్రశ్నించారు. ఉప ముఖ్యమంత్రి డీకే శివకుమార్ కేంద్రం ప్రకటించిన వాటాపై స్పందిస్తూ రాష్ట్రం నుంచి రెండు సార్లు రాజ్యసభకు ఎన్నికైన నిర్మలా సీతారామన్‌తో పాటు నలుగురు కేంద్ర మంత్రివర్గంలో ఉన్నా వారంతా రాష్ట్ర హక్కుల గురించి ప్రశ్నించటం లేదని ఆరోపించారు. మాజీ ఎంపీ డీకే సురేశ్ గతంలో కేంద్రంపై ఇదే అంశంపై ఆరోపించారు. దక్షిణ భారత రాష్ట్రాలపై కేంద్రం ఇదే నిర్లక్ష్యాన్ని కొనసాగిస్తే ప్రత్యేక దేశం కోసం పోరు తప్పదని గతంలో పార్లమెంట్ భవనం వద్ద ఆరోపించిన డీకే సురేశ్ ఈసారి అన్ని రాష్ట్రాలు తరలి రావాలని పిలుపునిచ్చారు.

## ఆంగ్లేయులకు రాణి చెన్నమ్మ సింహ స్వప్నం



రాయచూరులోకి ప్రవేశించిన యాత్ర

**రాయచూరు, న్యూస్‌టుడే :** కిత్తూరు ఉత్సవాన్ని పురస్కరించుకుని రాష్ట్ర వ్యాప్తంగా చేపట్టిన విజయజ్యోతి యాత్ర ఆదివారం రాయచూరు పట్టణానికి చేరుకుంది. బసవేశ్వర కూడలి వద్ద రాయచూరు తహసీల్దార్ సురేష్ వర్మ, అధికారులు ఘన స్వాగతం పలికారు. రథంలోని రాణి చెన్నమ్మ ప్రతిమకు తహసీల్దార్ పూజలు చేసి స్వాగతం పలికారు. ఈ సందర్భంగా వర్మ మాట్లాడుతూ దేశ స్వాతంత్ర్యం కోసం కిత్తూరి రాణి చెన్నమ్మ చిరస్మరణీయమైన పోరాటాలు చేశారని కొనియాడారు. ఆంగ్లేయుల పాలిట సింహస్వప్నమై, మడమ తిప్పని సమరం చేసిన ఈమె పోరాట పటిమ మహిళా లోకానికి స్ఫూర్తిదాయకమని పేర్కొన్నారు. చెన్నమ్మ సాహసం, శౌర్యం, త్యాగం, దేశభక్తిని యువత ఆదర్శంగా తీసుకోవాలని పిలుపునిచ్చారు. అనంతరం యాత్ర చంద్రమౌళేశ్వర, గంజ్ కూడళ్లు, దేవసూగూరు గ్రామం మీద యాదగిరి వైపు వెళ్లింది. రాయచూరు తాలూకా పంచాయతీ ఇవో చంద్రశేఖర్ పవార్, రాయచూరు నగరసభ కమిషనర్ గురు సిద్ధయ్య హీరేమఠ, కన్నడ, సంస్కృతి శాఖకు చెందిన ఇస్మాయిల్, జిల్లా కన్నడ సాహిత్య పరిషత్ సహ కార్యదర్శి దండప్ప బిరాదార్ హాజరయ్యారు. ఈ నెల 23 నుంచి 25 వరకు బెళగావి జిల్లా కిత్తూరులో ఉత్సవాన్ని నిర్వహిస్తారు.

## రంగోత్సవ నాటక ప్రదర్శన



పాత్రికేయులతో మాట్లాడుతున్న అక్కి

**రాయచూరు, న్యూస్‌టుడే :** స్థానిక కన్నడ భవన్‌లో ఈ నెల 15, 16 తేదీల్లో రంగోత్సవ నాటక ప్రదర్శన ఏర్పాటు చేసినట్లు భగత్ సేవా సాంస్కృతిక సంఘం అధ్యక్షుడు వి.ఎన్.అక్కి తెలిపారు. తొలి రోజు శ్రీ కృష్ణ సంధానం, రెండో రోజు మోళిగ మారయ్య నాటకాల ప్రదర్శన జరుగుతుందని వివరించారు. ఆయన ఆదివారం పత్రికాభవన్‌లో పాత్రికేయుల సమావేశంలో మాట్లాడారు. 15న సాయంత్రం 6 గంటలకు ఎయిమ్స్ సాధనా పోరాట సమితి సంచాలకుడు బసవరాజ కళస ప్రారంభిస్తారని, ముఖ్య అతిథులుగా సాహితీవేత్త రుద్రప్ప, వీర హనుమాన్, అయ్యప్పయ్య హుడా, జిల్లా విలేకర్ల సంఘం అధ్యక్షుడు గురునాథ్, రిపోర్టర్స్ గిల్డ్ అధ్యక్షుడు చెన్న బసణ్ణ, రాయచూరు తాలూకా కసాప అధ్యక్షుడు వెంకటేష్ బేవిన బెంచి పాల్గొంటారని వివరించారు. నాటక అభిమానులు హాజరై కళాకారులను ప్రోత్సహించాలని కోరారు. సమావేశంలో రంగస్వామి, వెంకట నరసింహులు పాల్గొన్నారు.

## రోడ్డు ప్రమాదంలో ఇద్దరి దుర్మరణం



ద్విచక్ర వాహనం వద్ద మృత దేహం

**రాయచూరు, న్యూస్‌టుడే :** రహదారి ప్రమాదం ఇద్దరిని బలి తీసుకుంది. ద్విచక్ర వాహనాన్ని వెనుక నుంచి లారీ ఢీకొన్న ఘటనలో మృత్యువాత పడ్డారు. ఈ దుర్ఘటన ఆదివారం మధ్యాహ్నం స్థానిక హైదరాబాద్ రహదారిలోని వైటీపీఎస్‌కు దగ్గర జరిగింది. మృతులను జనార్దన్ (35), చెన్నబసవ పాటిల్ (35)గా గుర్తించారు. రాయచూరు తాలూకా చిక్కసూగూరులో నివసిస్తున్న వీరు బైక్‌లో రాయచూరుకు వెళుతుండగా.. శక్తినగర్ నుంచి రాయచూరు వైపు వస్తున్న లారీ ఢీకొట్టడంతో కింద పడిపోయారు. తీవ్ర రక్తస్రావమై ప్రమాద స్థలంలోనే ఇద్దరూ ప్రాణాలు విడిచారు. రాయచూరు గ్రామీణ ఠాణా పోలీసులు ప్రమాద స్థలాన్ని పరిశీలించారు. మృతదేహాలను పోస్టుమార్టం చేసేందుకు రిమ్స్‌కు తరలించారు.

**విద్యార్థిని మృతి..:** రాయచూరుకు సమీపంలోని లింగసూగూరు రహదారి బసవేశ్వర ఆసుపత్రికి దగ్గర్లో శనివారం సాయంత్రం జరిగిన రోడ్డు ప్రమాదంలో విద్యార్థిని దుర్మరణం పాలైంది. సాక్షి (22) అనే విద్యార్థిని తన సోదరి సంజనతో కలిసి స్కూటీలో ప్రయాణిస్తూ రహదారి క్రాస్ చేస్తుండగా కారుఢీ కొట్టింది. ఇద్దరూ కింద పడిపోయారు. తీవ్ర గాయాలైన సాక్షి మృతి చెందింది. వాహనాన్ని నడుపుతున్న సోదరికి చిన్నపాటి గాయాలయ్యాయి. సంచార ఠాణా పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.



విలేకరులతో మాట్లాడుతున్న విరూపాక్షి

## వర్గీకరణ తర్వాతే ఖాళీలు భర్తీ చేయాలి

**రాయచూరు, న్యూస్‌టుడే :** దళితుల వర్గీకరణ తర్వాతే ఖాళీ ఉద్యోగాలను భర్తీ చేయాలని ప్రభుత్వంపై ఒత్తిడి పెంచేందుకు ఈ నెల 16న రాష్ట్ర వ్యాప్తంగా జిల్లా కేంద్రాల వద్ద ఆందోళన చేస్తామని అంతర్గత రిజర్వేషన్ ఐక్య పోరాట సమితి సంచాలకుడు విరూపాక్షి వెల్లడించారు. ఆయన ఆదివారం పత్రికాభవన్‌లో పాత్రికేయుల సమావేశంలో మాట్లాడారు. ఈ నెల 5న రాయచూరుకు విచ్చేసిన సీఎం సిద్ధరామయ్యను కలిసి వర్గీకరణ చేశాకనే ఉద్యోగాలను భర్తీ చేయాలని కోరగా, ఆయన స్పందించి వర్గీకరణ గురించి మంత్రి మండలి సమావేశంలో చర్చిస్తానని, ఆర్థిక శాఖ కార్యదర్శికి సూచిస్తానని హామీ ఇచ్చారని తెలిపారు. బెంగళూరుకు వెళ్లాక 30 వేలకు పైగా ఉద్యోగాలను నింపుతామని ప్రకటించి అందరినీ ఆశ్చర్యానికి గురి చేశారన్నారు. ఖాళీలను భర్తీ చేస్తే సర్వోన్నత న్యాయస్థానం తీర్పును ఉల్లంఘించినట్లు అవుతుందన్న విషయాన్ని గమనించాలని కోరారు. వర్గీకరణ చేయక ఉదాశీనంగా వ్యవహరిస్తే మాదిగ సామాజిక వర్గం ప్రజలు సరైన సమయంలో గుణపాఠం చెబుతారని హెచ్చరించారు. సమావేశంలో నరసప్ప దండోరా, పి.యల్లప్ప, తిమ్మప్ప ఫిరంగి, భీమణ్ణ మంచాల, సుభాష్ అస్కిహాళ్, షంషాలం, రాఘవేంద్ర బోరెడ్డి, రవీంద్ర జల్దార్ పాల్గొన్నారు.

## అమ్మ విశ్వరూపం.. ఉప్పొంగిన భక్తిభావం



భువనేశ్వరి ఊరేగింపులో లంబాడీల నృత్యం



సోమవారపేట మఠంలో వడిబియ్యం అందుకున్న మహిళలు

**రాయచూరు, న్యూస్‌టుడే :** జిల్లా వ్యాప్తంగా దసరా పండగను భక్తి పూర్వకంగా, సంప్రదాయ బద్ధంగా జరుపుకొన్నారు. సృష్టి, స్థితి, లయ కర్తలను సృష్టించిన శక్తి మాత ఆలయాలు, దేవతామూర్తులను భక్తులు దర్శించుకున్నారు. అమ్మవారి విశ్వరూపాన్ని చూసి ఉప్పొంగిపోయారు. నగరంలోని కాళికామాత, కందగడ్డ మారెమ్మ, మావిన చెరువుకు దగ్గర్లోని భవానీ, తిమ్మాపూర పేటలోని బాలమారెమ్మ, దళితవాడలోని మారెమ్మ, గూడ్స్‌షెడ్ ప్రాంతంలోని ముత్యాలమ్మ, నగరేశ్వర ఆలయాలు సాయంత్రం నుంచి రాత్రి వరకు కిక్కిరిశాయి. ఉప్పారవాడి లక్ష్మీ వెంకటేశ్వర దేవస్థానంలో శ్రీనివాసుడి కల్యాణం అంగరంగ వైభవంగా సాగింది. దేవస్థాన సమితి అధ్యక్షుడు మద్దికెరె ఈరణ్ణ, గౌరవ అధ్యక్షుడు గట్టు వెంకటేష్, సభ్యులు ఆంజనేయ, ఆదోని అదిరాజ్, జూకూరు శ్రీనివాస్, బాలచేడ్ వెంకబా తదితరులు పాల్గొన్నారు. మున్నూరు కాపు సమాజం నేతృత్వంలో గద్వాల్ రహదారి దగ్గర్లోని మాతా మహాలక్ష్మి, కాళికాదేవి ఆలయాలు సందడిగా మారాయి. చివరి రోజు విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శనలో ఎమ్మెల్యే శివరాజ్ పాటిల్, మున్నూరు కాపు సమాజం ప్రముఖులు పాపారెడ్డి, జి.బసవరాజరెడ్డి, బెల్లం నరసరెడ్డి తదితరులు హాజరయ్యారు. సోమవారపేట హీరే మఠంలో స్వామీజీ రాయచోటి వీర శివాచార్య సమక్షంలో మహిళలకు వడి బియ్యం పెట్టారు. నిజలింగప్ప కాలనీ మిలీనియం ఉద్యానవనంలో భ్రమరాంబ జగన్మాత రూపంలో భక్తకోటికి దర్శనం ఇచ్చింది. దసరా సందర్భంగా కన్నడ భవన్‌లో నవయాన సంఘవతి అశోక్ విజయోత్సవం నిర్వహించారు. బోళమానదొడ్డి రహదారిలోని బిల్వ మందిరంలో జగన్మాత పరమేశ్వరికి మంగళవాయిద్యాలతో పల్లకీ సేవ జరిగింది. సంగయ్య స్వామి శమీ పూజలు చేశారు. మధురానగర్, కృష్ణదేవరాయ, ఆశీర్వాద, సుచిత్రా, నిసర్గ, సూగూరేశ్వర, న్యూ ఎన్‌జీవీ, జయనగర్, చాణిక్యపురి, పంచముఖి కాలనీలు, విద్యానగర్‌కు చెందిన భక్తులు పూజలను తిలకించారు. నగరంలో వివిధ చోట్ల మండపాల్లో ప్రతిష్ఠించిన అమ్మవార్లకు ప్రత్యేక పూజలు చేసి, వైభోపేతంగా శోభాయాత్ర నిర్వహించి ఖాసబావిలో నిమజ్జనం చేశారు. నగరసభ ఆధ్వర్యంలో నాడహబ్బ దసరా పండగ అత్యంత ఘనంగా జరిగింది. భువనేశ్వరిదేవి విగ్రహాన్ని వైభవంగా ఊరేగించారు. నగరసభ కార్యాలయం వద్ద మధ్యాహ్నం ఒంటి గంటకు కిల్లే బృహన్మఠం స్వామీజీ శాంతమల్ల శివాచార్యులు పూజ చేసి ఊరేగింపును ప్రారంభించారు. ఆకర్షణీయమైన కళా బృందాల మధ్య మాణిక ప్రభు దేవస్థానానికి సాయంత్రం చేరింది. నగరసభ అధ్యక్షురాలు నరసమ్మ, కమిషనర్ గురుసిద్ధయ్య హీరేమఠ, శాసనసభ్యుడు శివరాజ్ పాటిల్, కౌన్సిలర్ జయణ్ణ తదితరులు పాల్గొన్నారు.



గద్వాల్ రహదారి ఆలయాల ఆవరణలో అమ్మవారి నృత్యం



జగన్మాత రూపంలో భ్రమరాంబ

## ప్రియుడి మాయలో పడి బిడ్డల్ని కడతేర్చిన తల్లి

**రామనగర, న్యూస్‌టుడే :** భర్తను విడిచి పెట్టి, ప్రియునితో బెంగళూరుకు పరారైన ఒక మహిళ (24) తన ఇద్దరు బిడ్డలను హత్య చేసి శ్మశానవాటికలో పూడ్చి పెట్టింది. బెంగళూరు డీజే హళ్లిలో ఉంటున్న ఆమె తన మూడేళ్ల కుమారుడు, 11 నెలల కుమార్తెను హత్య చేసిందని గుర్తించారు. ట్యానరీ రోడ్డు ఏకే కాలనీకి చెందిన ఆమె తన 27 ఏళ్ల ప్రియునితో పరారైందని గుర్తించారు. కొద్ది రోజుల క్రితం ప్రియునితో పరారైన ఆమె రామనగర పరిధి బిజూరులో ఇద్దరు పిల్లలతో కలిసి ప్రియునితో కాపురం పెట్టింది. అక్టోబరు ఒకటో తేదీన ఒక బిడ్డ మరణించిందని స్థానిక శ్మశానవాటికకు తన ప్రియునితో కలిసి వెళ్లి అంత్యక్రియలు చేసింది. మళ్లీ అక్టోబరు 7న ఇంకో బిడ్డ మరణించిందని అంత్యక్రియలు చేసి వచ్చింది. అనుమానం వచ్చిన అక్కడి కాపలాదారు ఆ మహిళ, ఆమె ప్రియుడు ఫొటోలను తన చరవాణిలో తీసి పోలీసులకు అందించడంతో ఈ హత్యలు వెలుగులోకి వచ్చాయి. పరారీలో ఉన్న ఆ మహిళ, ఆమె ప్రియుని కోసం గాలింపు తీవ్రం చేశారు.

## కుమారస్వామిపై ఫిర్యాదు

**బెంగళూరు (శివాజీనగర), న్యూస్‌టుడే :** తనపై తప్పుడు ఆరోపణలు చేసి, దూషణలకు పాల్పడిన కేంద్ర మంత్రి హెచ్‌డీ కుమారస్వామి, ఆయన కుమారుడు నిఖిల్ కుమారస్వామి, దళ్ నాయకుడు సురేశ్ బాబులపై ఐపీఎస్ అధికారి ముప్పా చంద్రశేఖర్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఏడీజీపీ ఫిర్యాదు ఆధారంగా సంజయనగర ఠాణా పోలీసులు ఎన్‌సీఆర్ (తీవ్ర స్వరూపం కాని కేసు)ను నమోదు చేశారు. తనపై లోకాయుక్తలో ఉన్న కేసుల విచారణకు హాజరైన అనంతరం కొద్ది రోజులకే కుమారస్వామి తనను దూషిస్తూ, తప్పుడు ఆరోపణలు చేశారని పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో ఆయన పేర్కొన్నారు. తనపై నమోదైన కేసుల విషయంలో న్యాయపోరాటం చేస్తానని కేంద్ర మంత్రి కుమారస్వామి ఆదివారం ఇక్కడ తెలిపారు.

## ‘నేనూ పోటీ చేస్తా’

**దావణగెరె, న్యూస్‌టుడే:** చెన్నపట్టణ లోక్‌సభ ఎన్నికల్లో ఎన్‌డీఏ అభ్యర్థిగా తానే పోటీలో ఉంటానని కేంద్ర మంత్రి హెచ్‌డీ కుమారస్వామి పేర్కొన్నారు. దావణగెరెలో విలేకరులతో ఆదివారం మాట్లాడుతూ, కాంగ్రెస్ పార్టీ ప్రజలను దారి తప్పించేందుకు పోటీలో ఎవరు ఉంటారనే అంశంలో గోప్యత పాటిస్తున్నట్లే తామూ వ్యవహరిస్తున్నామని చెప్పారు. నిఖిల్ పోటీ చేస్తాడా, తాను పోటీ చేస్తానా అనే విషయాన్ని ఇప్పుడే చెప్పడం సాధ్యం కాదన్నారు. అవసరమైతే తానే పోటీలో ఉంటానని పేర్కొన్నారు.

### తుంగభద్ర జలాశయం నీటిమట్టం

పూర్తిస్థాయి నీటిమట్టం 1633 అడుగులు

| 13-10-2024 (ఉ॥ 8 గంటలకు) | ప్రస్తుతం | గత సంవత్సరం |
|---|---|---|
| నీటిమట్టం (అడుగుల్లో) | 1631.97 | 1614.75 |
| ఇన్‌ఫ్లో (క్యూసెక్కుల్లో) | 84,504 | 360 |
| అవుట్‌ఫ్లో (క్యూసెక్కుల్లో) | 82,968 | 9,254 |
| నీటి నిల్వ (టి.ఎం.సి) | 101.656 | 47.828 |

గరిష్ఠసామర్థ్యం (133 టీఎంసీలు) వాస్తవసామర్థ్యం 105.788 టీఎంసీలు

## ‘వన్ హెల్త్’ మిషన్‌తో సమగ్ర ఆరోగ్య రక్షణ



కొత్త ఆవిష్కరణలపై వివరణ ఇస్తున్న యువ శాస్త్రవేత్తలు



వన్‌హెల్త్‌ను ఆవిష్కరించిన తిరుమల్ అరోహి, డా.విశాల్‌రావ్, కిరణ్ రుద్రప్ప తదితరులు

**ఈనాడు, బెంగళూరు :** ఆరోగ్య చికిత్సల్లో ఆధునిక సాంకేతికతను సమగ్రంగా వినియోగించుకునే దిశగా ‘వన్ హెల్త్ మిషన్’ను ఆవిష్కరించారు. నగరానికి చెందిన నవ్యాలోచనలు, అంకురాల పర్యావరణ వ్యవస్థల కేంద్రం పాస్‌పోల్ నేతృత్వంలో ఈ మిషన్‌ను ఆవిష్కృతమైంది. ఇన్ఫోసిస్, భారతీయ విజ్ఞాన సంస్థ(ఐఐఎస్‌సీ), హెచ్‌సీజీ వంటి సంస్థల సమన్వయంతో ఈ సమగ్ర ఆరోగ్య మిషన్ రూపొందించారు. మారుతున్న ఆధునిక సాంకేతికతలను సమర్థమంతంగా వినియోగించుకుంటూ సంప్రదాయ చికిత్స విధానాల పరిమితులను చెరిపివేసే ఈ మిషన్ కృత్రిమ మేధతో తయారైన దూరవైద్యం, వైద్య పరికరాలు, కొత్త తరం ఆవిష్కారాలతో రూపొందించినట్లు సంస్థ సీఈవో కిరణ్ రుద్రప్ప తెలిపారు. ఆధునిక సమాజం ఎదుర్కొనే సవాళ్ల నేపథ్యంలో మానవ, జీవ రాశులు, పర్యావరణాన్ని ఆధునిక సాంకేతికత వ్యవస్థల సాయంతోనే పరిరక్షించాలి. ఈ క్రమంలో వన్‌హెల్త్ మిషన్ డిజిటల్ ఏఐ, కొత్తతరం ఔషధాలు, వైద్య విధానాలు, ఆరోగ్య వ్యవస్థలను సమన్వయంతో రూపొందించామన్నారు. సమగ్ర ఆరోగ్యం, విజ్ఞానం, సాంకేతికతలతో ప్రజారోగ్య సవాళ్లను ఎదుర్కోవాలని పాస్‌పోల్ హెల్త్ అధ్యక్షులు డా.విశాల్ రావ్ తెలిపారు. గ్లోబల్ టెక్ ట్రాన్స్‌ఫర్, లాంగ్విటీ ఎక్స్‌పీరియెన్స్, ప్యాండమిక్ ప్రిపేర్డ్‌నెస్ సెంటర్ల సమన్వయంతో వన్‌హెల్త్ మిషన్ రూపొందించామన్నారు. కొత్తతరం అంకురాలు, పరిశ్రమలు, వైద్య పరిశోధన సంస్థల మధ్య సమన్వయంతో ఈ సమగ్ర విధానంతో కొత్తతరం ఆరోగ్య సమస్యలను సులువుగా పరిష్కరించవచ్చని ఇన్ఫోసిస్ ఎగ్జిక్యూటివ్ ఉపాధ్యక్షులు తిరుమల్ అరోహి, ఐఐఎస్‌సీ లాంగ్విటీ ఇండియా కన్వీనర్ డా.దీపక్ సైని తదితరులు అభిప్రాయపడ్డారు.

## సౌహార్ద్రత భంగానికి విపక్షాల కుట్ర: సిద్ధు



సిద్ధరామయ్యను సత్కరిస్తున్న శివరాత్రి దేశికేంద్ర స్వామి

**మైసూరు, న్యూస్‌టుడే:** రాష్ట్రంలో చక్కని వర్షాలు కురవడం, అన్నదాతలు సంతోషంగా ఉండడంతో దసరా వేడుకలను ఘనంగా నిర్వహించేందుకు అవకాశం కలిగిందని ముఖ్యమంత్రి సిద్ధరామయ్య పేర్కొన్నారు. రాష్ట్రంలో అశాంతిని రేకెత్తించి, ప్రజల మధ్య సౌహార్ద్రతను పాడు చేసేందుకు కొందరు ప్రయత్నిస్తున్నారని విపక్ష నేతలను ఉద్దేశించి పరోక్ష వ్యాఖ్యలు చేశారు. అలాంటి వారికి అమ్మవారు సద్బుద్ధి ఇవ్వాలని ప్రార్థిస్తున్నానని చెప్పారు. మంత్రులు లక్ష్మీ హెబ్బాళ్కర్, మహదేవప్ప తదితరులతో కలిసి సుత్తూరు మఠానికి వెళ్లారు. మఠంలో అమ్మవారికి పూజ చేసుకున్నారు. దేశికేంద్ర స్వామి నుంచి సత్కారాన్ని అందుకుని మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం పన్ను వాటా విడుదలలో కర్ణాటకకు అన్యాయం చేస్తోందని ఆరోపించారు. కేంద్రం 28 రాష్ట్రాలకు రూ.1,78,193 కోట్లు విడుదల చేయగా, కర్ణాటకకు కేవలం రూ.6,498 కోట్లు మాత్రమే విడుదల చేసిందన్నారు. దేశంలో అత్యధిక పన్ను వసూలు చేసి కేంద్రానికి అందిస్తున్న రాష్ట్రాలలో రెండో స్థానంలో ఉన్న కర్ణాటకకు తక్కువ నిధులు విడుదల చేయడం కేంద్రం చూపిస్తున్న సవతి తల్లి ప్రేమకు ఉదాహరణ అన్నారు. దీనిపై భాజపా నాయకులు కేంద్రాన్ని ప్రశ్నించాలని డిమాండ్ చేశారు.

## ఆధారరహిత పోరాటాలు



కళసా బండూరి ప్రతినిధుల నుంచి వినతి పత్రాన్ని తీసుకుంటున్న సిద్ధరామయ్య

**హుబ్బళ్లి, న్యూస్‌టుడే :** భాజపా నాయకులు ఆధార రహిత పోరాటాలు, అబద్ధపు ప్రచారాలు చేయడంతో పాటు వదంతులను సృష్టించడంలో ముందుంటారని ముఖ్యమంత్రి సిద్ధరామయ్య ధ్వజమెత్తారు. హుబ్బళ్లిలో 2022లో జరిగిన మత ఘర్షణలకు సంబంధించి తప్పుడు ఆరోపణలు, తప్పుడు కేసులు నమోదై ఉంటే, వాటిపై చర్చించి కేసుల ఉపసంహకరణకు చర్యలు తీసుకునేందుకు మంత్రివర్గ ఉపసమితిని ఏర్పాటు చేశామన్నారు. అప్పటి అన్ని కేసులను ప్రభుత్వం రద్దు చేసిందంటూ భాజపా ప్రచారం చేస్తూ ధర్నాకు దిగడం సిగ్గు చేటన్నారు. హుబ్బళ్లిలో పోలీసుల నుంచి గౌరవ వందనాన్ని, కళసా బండూరి సాధన సమితి నుంచి వినతి పత్రాన్ని ఆదివారం అందుకుని మాట్లాడారు. విచారణలో ఏవైనా తప్పుడు కేసులు నమోదైనట్లు గుర్తిస్తే, న్యాయస్థానం దృష్టికి తీసుకువెళ్లి, వాటిని రద్దు చేస్తామన్నారు. ప్రభుత్వం నేరుగా కేసులను రద్దు చేయడం సాధ్యం కాదన్నారు. గతంలో భాజపా నాయకులపై నమోదైన తప్పుడు కేసులనూ రద్దు చేసిన విషయాన్ని గుర్తు చేశారు.